Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు

# RAJADHANI VARTALU

ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్దతి కానే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు

rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి సంపుటి (Vol) : 7 సంచిక (Issue) : 217 పేజీలు (Pages) : 8 వెల : రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

మంగళవారం, 7 - 4 - 2026

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com NI No.: APTEL/2019/77985 Postal regd: GTR/114/2025-27 స్థాపితం : 2015

## కోస్తా జిల్లాల్లో ఈదురు గాలులతో కూడిన వర్షాలు : వాతావరణ శాఖ



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** కోస్తా జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ సోమవారం వెల్లడించింది. పలుచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తాయని వివరించింది. ఒడిశా, దక్షిణ కోస్తా ప్రాంతాల్లోని ఉపరితల ఆవర్తనం ఏర్పడిందని విశాఖపట్నంలోని వాతావరణ శాఖ వివరించింది. ఈ నేపథ్యంలో రాగల 24 గంటల్లో శ్రీకాకుళం, పార్వతీపురం, అనకాపల్లి, కాకినాడ, యానాం, కోనసీమ, అల్లూరి సీతారామ రాజు మన్యం, తూర్పు గోదావరితోపాటు ఏలూరు జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని తెలిపింది. మిగిలిన జిల్లాల్లో ఒక మోస్తరు వర్షాలు పడతాయని స్పష్టం చేసింది. దీంతో కోస్తా తీరం వెంబడి గంటకు 45 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది. మరోవైపు రాష్ట్రంలోని పలు జిల్లాలో సోమవారం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ వెల్లడించారు. ఈ నేపథ్యంలో పిడుగులు పడే అవకాశం ఉందని అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు స్పష్టం చేశారు. అలాగే గాలుల తీవ్రత దృష్ట్యా పాత భవనాలు, విద్యుత్ స్తంభాలు, చెట్ల కింద, భారీ హోర్డింగ్స్ వద్ద నిలబడ వద్దని హెచ్చరించారు. ఆదివారం శ్రీకాకుళం, తిరుపతి జిల్లాల్లో పిడుగులు పడి ముగ్గురు మరణించగా.. ఈ రోజు (సోమవారం) మార్కాపురంలో ఒకరు మరణించారు. మరో నలుగురు గాయపడ్డారు. చికిత్స కోసం వీరిని యర్రగొండపాలెం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

## బిందుసేద్యంతో కలుగుతున్న ప్రయోజనాలపై రైతులతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చర్చ









**తాడిపత్రి, (రాజధాని వార్తలు):** తాడిపత్రి నియోజకవర్గం యాడికి సమీపంలోని పెండేకల్ రిజర్వాయర్ వద్ద రైతులతో మాట్లాడారు. బిందు సేద్యం, ప్రకృతి వ్యవసాయం, పీఎండీఎస్, ఉపాధి హామీ సహా వివిధ అంశాలపై రైతులు, కూలీల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్థానిక రైతులైన నీలం శ్రీనివాసరెడ్డి, లక్కు శ్యామలతో రిజర్వాయర్ పరిధిలో సాగునీటి అవసరాలు, సాగు కోసం ఎలాంటి విధానాలు అవలంభిస్తున్నారన్న అంశాలపై వారితో మాట్లాడారు. రైతులు పరిమి చరణ్ కుమార్, పాపసాని ముని యుగంధర్‌లతోనూ బిందుసేద్యంతో కలుగుతున్న ప్రయోజనాలపై చర్చించారు. డ్రిప్ ఇరిగేషన్ పరికరాలను ప్రభుత్వం తమకు 90 శాతం సబ్సీడికి ఇస్తోందని రైతులు సీఎంకు తెలిపారు. ప్రీమాన్ సూన్ డ్రై సోయింగ్ విధానం ద్వారా చేస్తున్న సాగు గురించి రైతులు హరికృష్ణ, దేవిల నుంచి ముఖ్యమంత్రి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ తరహా విధానం ద్వారా సాగు వ్యయం తగ్గుతోందని రైతులు సీఎంకు వివరించారు. సాగులో అర్ధచంద్రాకార గుంతల విధానం ద్వారా నేల సారవంతంగా మారి మెరుగైన ఫలితాలు వస్తున్నట్టు రైతులు నందిని, ప్రమీలమ్మ ముఖ్యమంత్రికి తెలిపారు.

## పోలీసులకు చిక్కిన నకిలీ కరెన్సీ ముఠా.. పక్కా ప్లాన్‌తో అడ్డంగా బుక్కయ్యారు

**పశ్చిమ గోదావరి, (రాజధాని వార్తలు):** జిల్లాలో నకిలీ కరెన్సీ ముఠా గుట్టును పోలీసులు రట్టు చేశారు. ఫేక్ కరెన్సీ మార్చుకునేందుకు వచ్చిన ముఠా పోలీసులకు అడ్డంగా బుక్కయ్యింది. నిందితుల నుంచి రూ.2 కోట్లపైగా నకిలీ నగదును స్వాధీనం చేసుకుని వారిని అరెస్టు చేశారు. పక్కా సమాచారంతో ప్లాన్ వేసి ముఠా సభ్యులకు షాక్ ఇచ్చారు పోలీసులు. ఈ ఘటన జిల్లా కేంద్రం భీమవరంలో జరిగింది. తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలుకు చెందిన కొవ్వూరి గోపిచంద్రారెడ్డి, ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెంకు చెందిన వేముల మోహనసాయి, బర్రె సుధీర్ అనే వ్యక్తులు మార్కెట్‌లో ఫేక్ కరెన్సీ సరఫరా చేస్తున్నారు. అయితే, రూ.లక్షకు రూ.3లక్షల ఫేక్ కరెన్సీ ఇస్తామని భీమవరానికి చెందిన శివశంకర్‌ను ఈ ముఠా నమ్మించింది. రూ.3 లక్షలు ఇస్తే రూ.9 లక్షలు ఇచ్చేలా మాట్లాడుకున్నారు. అయితే, ఫేక్ కరెన్సీకి బదులుగా డమ్మీ కరెన్సీని చూపించారు ముఠా సభ్యులు. అనుమానం వచ్చి పోలీసులకు శివశంకర్ సమాచారం ఇచ్చారు.



పక్కా పథకం ప్రకారం నోట్లు మార్పిడి జరిగే ప్రాంతంలో పోలీసులు మాటు వేశారు. కరెన్సీ మార్చుకునే సమయంలో చాకచక్యంగా ముఠాను అరెస్టు చేశారు. గోపిచంద్రారెడ్డి, వేముల మోహనసాయిని అరెస్టు చేయగా.. బర్రె సుధీర్ పరారయ్యాడు. వారి నుంచి రూ.2.9 కోట్ల విలువగా చూపించే డమ్మీ నోట్లు స్వాధీనం చేసుకున్నారు. అలాగే కారును సీజ్ చేశారు. కాగా, పారిపోయిన నిందితుడి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.

## గ్రంథాలయాల ఆధునీకరణే లక్ష్యంగా పనిచేయాలి : మంత్రి కందుల దుర్గేష్

**- ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ జుత్తిగ నాగరాజుకు మంత్రి కందుల దుర్గేష్ దిశానిర్దేశం - బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారిగా మంత్రి దుర్గేష్ ని మర్యాదపూర్వకంగా కలిసిన ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ జుత్తిగ నాగరాజు - పార్టీ బలోపేతంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచన**





**నిడదవోలు, (రాజధాని వార్తలు):** ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని గ్రంథాలయాల అభివృద్ధి, ఆధునీకరణపై ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ సూచించారు. సోమవారం నిడదవోలు నియోజకవర్గం పెరవలి మండలం తీపర్రులో జరిగిన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి దుర్గేష్ ని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన జుత్తిగ నాగరాజు మర్యాదపూర్వకంగా కలిశారు.

ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ ఆయనకు అభినందనలు తెలుపుతూ పలు కీలక సూచనలు చేశారు. గ్రంథా లయాల్లో విద్యార్థులకు, నిరుద్యోగ యువతకు పోటీ పరీక్షలకు ఉపయోగపడే అత్యాధునిక పుస్తకాలను అందుబాటులో ఉంచా లని ఆదేశించారు. ప్రస్తుత కాలానికి అనుగుణంగా గ్రంథాల యాలను కేవలం పుస్తకాలకే పరిమితం చేయకుండా డిజిటల్ వసతులతో ఆధునీకరించాలని కోరారు. ఉండి నియోజకవర్గ జనసేన ఇంచార్జిగా కూడా బాధ్యతలు నిర్వహిస్తున్న నాగరాజుకు జనసేన పార్టీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేసే దిశగా కృషి చేయాలని మంత్రి సూచించారు. నాయకత్వం తనపై ఉం చిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, గ్రంథాలయాల అభివృద్ధికి మరియు పార్టీ పటిష్టతకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఈ సందర్భంగా జుత్తిగ నాగరాజు మంత్రి దుర్గేష్‌కి విన్నవించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ముస్లింలపై వ్యతిరేకతతో యుద్ధాన్ని సమర్థించరాదు : రిటైర్డ్ ఐఎయస్ డాక్టర్ పి.వి. రమేష్


**గుంటూరు, (రాజధాని వార్తలు):** ముస్లింల పట్ల వ్యతిరేక భావనతో ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ చేస్తున్న అమానుష దాడులను సమర్థిస్తూ భారత ప్రధాని నరేంద్ర మోడీ ఖండించకపోవడం దురదృష్టకరమని అంతర్జాతీయ వ్యవహారాల నిపుణులు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పూర్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ డా॥ పి.వి. రమేష్ పేర్కొన్నారు. ఈనెల 6వ తేదీన గుంటూరులోని జనచైతన్య వేదిక హాలులో ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ దాడులు – ప్రపంచ దేశాలపై ప్రభావం అనే అంశంపై జరిగిన ముఖాముఖి కార్యక్రమానికి జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి అధ్యక్షత వహించారు. ప్రధాన వక్తగా విచ్చేసిన డా॥ పి.వి. రమేష్ ప్రసంగిస్తూ ప్రపంచంపై ఆధిపత్యాన్ని కొనసాగించడానికి,డాలర్ విలువను బలపరుచుకోవడానికి, అమెరికాలోని ఆయుధ లాబీయింగ్‌ను ప్రోత్సహించడానికి అమెరికా చేస్తున్న ప్రయత్నమే ఇరాన్‌పై దాడులని తెలిపారు. ఇరాన్ 5 వేల సంవత్సరాల క్రితమే నాగరికత దేశంగా పేరుగాంచిందని, పాలన వికేంద్రీకరణకు నాంది పలికిందన్నారు. ఇరాన్‌ను 31 భాగాలుగా విభజించి వారికి తగిన సైన్యం, ఆయుధాలు అందించడం వలననే అమెరికా, ఇజ్రాయిల్ దాడులను సమర్థవంతంగా ఎదుర్కోగలుగుతుందన్నారు. ఒకవైపు పాకిస్తాన్‌లాంటి దేశం సైతం యుద్ధ నివారణకు మధ్య వర్తిత్వం చేస్తుంటే మరోవైపు అమెరికా, ఇజ్రాయిల్ సంయుక్తంగా ఇరాన్ పై చేస్తున్న దాడులను భారత ప్రధాని నరేంద్ర మోడీ నేటికీ ఖండించకపోవడం విచారకరమన్నారు. యుద్ధ ప్రభావం ప్రపంచ వ్యాప్తంగా విస్తరించిందని, ముఖ్యంగా ఆయిల్, గ్యాస్, ఫర్టిలైజర్స్, హీలియంల కొరతతో విపరీతంగా పెరిగిన ధరల రీత్యా ప్రజలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఇజ్రాయిల్ వద్ద 90 అణు బాంబులు, అమెరికా వద్ద 4 వేలకు పైగా అణు బాంబులు ఉంచుకొని ఇరాన్‌ను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయని త్వరలో అణుబాంబును వినియోగించినా ఆశ్చర్యపడనక్కర్లేదన్నారు. అమెరికాలో 90 లక్షల మంది ప్రజలు రోడ్లపైకి వచ్చి ట్రంప్ యుద్ధోన్మాదాన్ని నిరసిస్తున్నారని, 60 శాతం పైగా అమెరికా ప్రజలు యుద్ధం పట్ల వ్యతిరేకతను వ్యక్తం చేస్తున్నారని వివరించారు. మిత్ర దేశాలుగా ఉన్న నాటో దేశాలు, యూరప్ దేశాలు కూడా ట్రంప్ చర్యలను ఖండిస్తున్నాయని పేర్కొన్నారు.



ఐక్యరాజ్యసమితి బలహీన పడటంతో యుద్ధ నివారణకు సత్వర చర్యలు చేపట్ట లేకపోతుందని పేర్కొన్నారు. జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ప్రసంగిస్తూ గత 18 నెలలుగా డోనాల్డ్ ట్రంప్ వికృత చేష్టలతో వెనిజులా పై దాడి చేసి ఆ దేశ అధ్యక్షుణ్ణి పట్టుకుని వెళ్లి ఆ దేశ చమురు వనరులను స్వాధీన పరచుకోవడం, ఉక్రెయిన్ యుద్ధంలో ఆ దేశ ఖనిజ సంపదను ఆశించడం, గ్రీన్ ల్యాండ్‌ను ఆక్రమించాలనుకోవడం, కెనడాను 51వ రాష్ట్రంగా చేర్చుకోవాలని తపన పడటం, పనామా కాలువను స్వాధీన పరుచుకోవాలను కోవడం, క్యూబాను ఆక్రమించుకోవాలనుకోవడం, నేడు అణ్వాయుధాలను బూచిగా చూపి ఇరాన్‌పై అమానుషంగా దాడులు చేయడాన్ని ప్రపంచ ప్రజలందరూ ఖండించాలన్నారు. మాజీ మంత్రివర్యులు డొక్కా మాణిక్య వరప్రసాద్ ప్రసంగిస్తూ ఇజ్రాయిల్ ప్రపంచానికి అణు బాంబులాంటిదని వారి రాజ్య విస్తరణ కాంక్ష ప్రపంచాన్ని ప్రమాదంలో నెడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ విద్యావేత్త ప్రొఫెసర్ డి.ఎ.ఆర్. సుబ్రహ్మణ్యం, మాజీ శాసనసభ్యులు లింగంశెట్టి ఈశ్వరరావు, జన చైతన్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.ధనుంజయ రెడ్డి, మానవత కోశాధికారి టి.వి. సాయిరాం, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ విశ్రాంత జనరల్ మేనేజర్ పోలూరి వీరారెడ్డి. వుయ్ ఆర్ విత్ యు చైర్మన్ శిగినం అయ్యప్ప, విశ్రాంత అడిషనల్ ఎస్పీ కె.వి. చలపతిరావు, రేట్ పేయర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఓరుగంటి నారాయణ రెడ్డి, కోవిడ్ ఫైటర్స్ వ్యవస్థాపకులు పఠాన్ అల్లా బక్షు, ఎస్. ఆర్. శంకరన్ నిరుపేదల సంఘం అధ్యక్షులు బత్తుల కోటేశ్వరరావు, తెలుగు భాషోద్యమ నేత డాక్టర్ వి.సింగారావు, కాంగ్రెస్ పార్టీ గుంటూరు జిల్లా అధ్యక్షులు సుధీర్ బాబు తదితరులు ప్రసంగించారు.

# ఘనంగా సింహపురిలో లాడియా 6వ స్టోర్ ప్రారంభం

**- నూతన షోరూమ్‌ను ప్రారంభించిన ప్రముఖ సినీ నటి మానస వారణాసి - ల్యాబ్-గ్రోన్ డైమండ్ రంగంలో సరికొత్త విప్లవం**






**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరులోని మాగుంట లేఔట్ లోని శనివారం లాడియా 6వ బ్రాంచ్‌ను ఘనంగా ప్రారంభించారు. భారతదేశంలోనే అతిపెద్ద ల్యాబ్-గ్రోన్ డైమండ్ స్టోర్ అయిన లాడియా వజ్రాలు అందరికీ సొంతం అనే నినాదంతో, నమ్మకమైన మరియు వినూత్నమైన డిజైన్లను లాడియా అందిస్తోంది. కార్యనిర్వహాలు అన్నారు. ఏర్పాటు చేసిన ఈ నూతన షోరూమ్‌ను ప్రముఖ సినీ నటి మానస వారణాసి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో లాడియా డైరెక్టర్ అఖిల్ వేములూరు, సాత్విక తదితరులు పాల్గన్నారు. ఈ సందర్భంగా లాడియా డైరెక్టర్ అఖిల్ వేములూరు మాట్లాడుతూ.. ల్యాబ్-గ్రోన్ డైమండ్ రంగంలో భారతదేశం ఎంతో అభివృద్ధి చెందుతోంది. ఆ ప్రయాణంలో భాగంగా, సరికొత్త ఐడియాలతో మేము ముందుకు వెళుతున్నాం. ఆభరణాలకు పెట్టింది పేరైన మా 6వ స్టోర్‌ను ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందిఅని తెలిపారు. ఈ ల్యాబ్-గ్రోన్ డైమండ్స్ ల్యాబ్-గ్రోన్ వజ్రాలను అత్యాధునిక సాంకేతికతతో ప్రయోగశాలల్లో తయారు చేస్తారు. ఇవి చూడటానికి, నాణ్యతలో మరియు మెరుపులో సహజమైన వజ్రాలతో సమానంగా ఉంటాయి. సహజ వజ్రాలకు ఇచ్చే రంగు మరియు క్లారిటీ గ్రేడింగ్‌నే వీటికి కూడా ఇస్తారు. లాడియా ప్రత్యేకతలు. అద్భుతమైన కలెక్షన్స్. హారాలు, వడ్డాణాలు, నెక్లెస్‌లు, గాజులు, పెండెంట్లు, బ్రాస్‌లెట్లు, కమ్మలు, జుంకాలు, ఉంగరాలు మరియు ప్రత్యేకమైన ల్యాబ్-గ్రోన్ పోల్కీ ఆభరణాలు ఇక్కడ లభిస్తాయి. కస్టమైజేషన్. మీకు నచ్చిన డిజైన్‌ను మీరే సొంతంగా తయారు చేయించుకోవచ్చు. సర్టిఫికేషన్: ప్రపంచ ప్రసిద్ధి చెందిన (ఐ జి ఐ)సంస్థ ద్వారా




సర్టిపై చేయబడిన వజ్రాలు మాత్రమే ఇక్కడ దొరుకుతాయి. సరసమైన ధరలు. క్యారెట్ వజ్రం ధర కేవలం రూ. 24,999 నుండే ప్రారంభం. స్టోర్ ప్రారం భోత్సవం సందర్భంగా ఏప్రిల్ 04 నుండి ఏప్రిల్ 19 వరకు ప్రత్యేక ఆఫర్లను ప్రకటించారు. వజ్రాల ధర మరియు మేకింగ్ ఛార్జీలపై ఫ్లాట్ 15% తగ్గింపు. జీరో వేస్టేజ్ సౌకర్యం. అద్భుతమైన వజ్రాల ప్రపంచాన్ని చూడటానికి ఈరోజే లాడియా స్టోర్‌ను సందర్శించండి అని అన్నారు.

# ఘనంగా శ్రీ మేధ స్కూల్ 11వ వార్షికోత్సవ వేడుకలు






**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు పెద్దబజార్‌లోని శ్రీ మేధ స్కూల్ 11వ వార్షికోత్సవ వేడుకలను స్కూల్ కరెస్పాండెంట్ పి. కొండారెడ్డి మరియు డైరెక్టర్ పి. లక్ష్మి ఆధ్వర్యంలో " మేధాస్ - తేజస్ సింఫోనీ -2కె26" పేరుతో టౌన్ హాల్ నందు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా 14వ డివిజన్ కార్పొరేటర్, ఏ.పి. ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ నెల్లూరు జిల్లా అధ్యక్షులు కర్తం ప్రతాప్ రెడ్డి మరియు అప్స ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ కరెస్పాండెంట్లు పాల్గొన్నారు. ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం వార్షికోత్సవం నిర్వహించి విద్యా ర్థులను ఉత్సాహపచడం సంతోషదాయకమన్నారు. ఇటు అకడ మిక్స్, కల్చరల్స్, స్పోర్ట్స్, ఐఐటి, అబాకస్, వేదిక్ మాథ్స్, స్పెల్ బి, చెస్, యోగ వంటి ప్రోగ్రామ్స్‌ను నిర్వహిస్తూ తక్కువ ఫీజులతో నాణ్యమైన విద్యను అందిస్తూ విద్యార్థుల యొక్క ఆల్ రౌండ్ డెవలప్మెంట్‌కి తోడ్పడుతున్నటువంటి మేధ స్కూల్ కరెస్పాండెంట్ పి.కొండారెడ్డి మరియు డైరెక్టర్ పి లక్ష్మిలను అభినందిస్తున్నామన్నారు. స్కూల్ కరెస్పాండెంట్ పి.కొండారెడ్డి మాట్లాడుతూ మేధాస్ తేజస్ సింఫోని 2కె26" 11వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం వలన విద్యార్థులు వారిలో ఉన్న టాలెంట్ ను ప్రదర్శించబడుతుందన్నారు. ఈ ప్రోగ్రాం ద్వారా విద్యార్థులు 2025-26 విద్యాసంవత్సరానికి గాను అకడమిక్స్, నాన్ అకడమిక్స్‌లో ప్రధమ, ద్వితీయ, తృతీయ, కన్సోలేషన్ బహుమతులను అందజేశామన్నారు. ఈ బహుమతులు విద్యార్థులు మరింతగా రాణించడానికి దోహదపడుతుందని తెలియజేశారు. 11 సంవత్సరాల విద్యా ప్రయాణంలో ఏ విషయంలోనూ రాజీ పడకుండా అర్హత, అనుభవం, అంకితభావం కలిగిన ఉపాధ్యాయులచే బోధన గావిస్తూ, విద్యార్థులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సాధారణ విద్యార్థులతో అసాధారణ ఫలితాలను ప్రతి సంవత్సరం పదవ తరగతి పరీక్షా ఫలితాలలో 100% ఫస్ట్ క్లాస్ ఫలితాలను, ప్రతి ముగ్గురిలో ఇద్దరికీ 500 పైగా మార్కులను సాధిస్తూ నెల్లూరు నగరంలో వన్ ఆఫ్ ద బెస్ట్ స్కూల్‌గా పేరు తెచ్చుకున్నందుకు సంతోషదాయకమన్నారు. స్కూల్ నందు కిండర్ గార్డెన్ మరియు ప్రైమరీ విభాగంలో సీబీఎస్ఈ కరుకులమ్‌ను యాక్టివిటీ బేస్డ్ లెర్నింగ్ టీచింగ్ ద్వారా అందిస్తున్నామన్నారు. అలాగే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్సీఈఆర్టీ సిలబస్‌తో పాటుగా చిన్నప్పటి నుంచి విద్యార్థులకు ఐఐటి, ప్రాబ్లం సాల్వింగ్, కంప్యూటర్స్, అబాకస్, వేదిక్ మాథ్స్, చెస్, యోగా వంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. శ్రీ మేధ స్కూల్ నందు విద్యార్థిగా చేరిన ప్రతి ఒక్కరికి క్రమశిక్షణ, విలువలతో కూడిన విద్యను అందించి సర్వతో ముఖాభివృద్ధి కి తోడ్పడుతామని తెలియజేశారు. ఈ 11 సంవత్సరాల ప్రయాణంలో స్కూల్ అభివృద్ధికి సహకరించినటువంటి ప్రతి ఒక్క తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు పేరు



పేరునా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. అలాగే వారి సహకారంతో మరెన్నో కార్యక్రమాలను మంచి ఫలితాలను సాధిస్తామన్నారు.

# 'జలధార'తో ప్రతి ఎకరాకు సాగునీరు : మంత్రి కందుల దుర్గేష్

**- నీటి సంరక్షణపై 100 రోజుల ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికపై మంత్రి దుర్గేష్ అధ్యక్షతన సుదీర్ఘ సమీక్ష..భూగర్భ జలాల పెంపునకు అత్యధిక ప్రాధాన్యతనివ్వాలని అధికారులకు, సాగునీటి సంఘాలకు దిశానిర్దేశం - "ప్రతి గ్రామానికి 'నీటి బడ్జెట్' - ప్రతి రైతుకు 'సాగు భరోసా'." -"సాగునీటి సంఘాలే ఈ జల యజ్ఞానికి డ్రైవింగ్ ఫోర్స్." -ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్‌గా 'జలధార':మంత్రి దుర్గేష్ - చెరువుల పునరుద్ధరణ, నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపు లక్ష్యంగా 4 దశల్లో కార్యక్రమం - నీటి భద్రత అంశంలో రైతులను, ప్రజలను భాగస్వామ్యం చేయాలని సూచన..ఈ కార్యక్రమానికి విస్తృత ప్రచారం కల్పించాలని ఆదేశం.. అందరికీ అవగాహన కల్పించాలని నిర్ణయం - ప్రతి నీటి చుక్కనూ సంరక్షించడం, ప్రతి ఎకరాకు నీరందించడం, ప్రతి రైతుకు భరోసానివ్వడమే కార్యక్రమం ఉద్దేశ్యమని మంత్రి దుర్గేష్ వెల్లడి - నియోజకవర్గంలో ప్రతి గ్రామానికి నీటి భద్రత ప్రణాళిక, ప్రత్యేక నీటి బడ్జెట్ ను సిద్ధం చేయాలని ఆదేశాలు జారీ - కేవలం కాగితాల మీద ప్రణాళికలు కాకుండా, క్షేత్రస్థాయిలో పనులు కనిపించాలన్న మంత్రి దుర్గేష్ - అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మంత్రి దుర్గేష్ పిలుపు**




**నిడదవోలు, (రాజధాని వార్తలు):** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించిన 100 రోజుల 'నీటి సంరక్షణ - జలవనరుల పరిరక్షణ' యాక్షన్ ప్లాన్‌లో భాగంగా నిడదవోలు నియోజకవర్గంలో 'జలధార' కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేస్తామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. సోమవారం పెరవలి ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన అధికారులకు, సాగునీటి సంఘాల ప్రతినిధులకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ ఏప్రిల్ 6 నుండి జూలై 14 వరకు నిర్వహించే ఈ 100 రోజుల కార్యాచరణలో భాగంగా చెరువుల పూడికతీత, కాలువల మరమ్మతులు, భూగర్భ జలాల పెంపు లక్ష్యంగా 4 దశల్లో కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలోని చెరువులన్నీ నింపి, భూగర్భ జలమట్టాన్ని కనీసం 1.5 మీటర్ల మేర పెంచడమే లక్ష్యంగా పనిచేయాలని ఇటీవల జరిగిన కేబినెట్ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశించారని, ఆ మేరకు నియోజకవర్గంలో చర్యలు చేపట్టాలని ఆదేశించారు. చెరువులను అనుసంధానం చేసే చైన్ లింక్ విధానం ద్వారా నీటి నిల్వలను పెంచి, వేసవిలో తాగు, సాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. నీటి భద్రత అంశంలో రైతులను, ప్రజలను భాగస్వామ్యం చేయాలని.. ప్రతి నీటి చుక్కను పొదుపు చేద్దాం- ప్రతి ఎకరాకు నీరందిద్దాం అనే నినాదంతో అవగాహన కల్పించి ముందుకు వెళ్లాలన్నారు. గ్రామ, మండల స్థాయి కమిటీల ప్రతిపాదనలను సిద్ధం చేసి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరికి పంపాలన్నారు. "నీటి భద్రత - సాగునీటి సంఘాల బాధ్యత" అనే నినాదంతో సాగునీటి సంఘాలు క్షేత్రస్థాయిలో డ్రైవింగ్ ఫోర్స్‌గా పనిచేయాలని మంత్రి దుర్గేష్ పిలుపునిచ్చారు. క్షేత్రస్థాయి వరకూ నీటి భద్రతపై ప్రత్యేక దృష్టి సారించేలా స్పష్టమైన కార్యాచరణ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి నిడదవోలు నియోజకవర్గంలో ప్రతి ఎకరాకు సాగునీరు అందేలా చూడాలని స్పష్టం చేశారు.ప్రతి నీటి చుక్కనూ సంరక్షించడం, ప్రతి ఎకరాకు నీరందించడం, ప్రతి రైతుకు భరోసానివ్వడమే కార్యక్రమం ఉద్దేశమని మంత్రి దుర్గేష్ ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమానికి విస్తృత ప్రచారం కల్పించాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. వాటర్ బాడీస్ ఉండే చోట నీరు అడుగంటి పోకుండా అందుబాటులో ఉన్న నీటిని సంరక్షించుకోవాలని దిశానిర్దేశం చేశారు. రైతాంగానికి ఉపయోగపడే సాగునీటిని, ఇతరత్రా ఉపయోగపడే నీటిని తప్పకుండా అందించాలని తెలిపారు. ఈ క్రమంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను మంత్రి దుర్గేష్ వివరించారు. జిల్లా స్థాయిలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ఒక కమిటీ ఉంటుందని, నియోజకవర్గాల్లో ప్రతి మండలానికి ఎంపీడీవో అధ్యక్షతన మండల కమిటీలు, గ్రామాల్లో గ్రామ కమిటీలు ఉంటాయన్నారు. ఇందులో నీటి సంఘాలతో పాటు గ్రామ పంచాయతీలు, స్థానిక ప్రజా ప్రతినిధుల భాగస్వామ్యం ఉండాలన్నారు. పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్లి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మంత్రి దుర్గేష్ అధికారులను ఆదేశించారు. తొలుత స్థానిక నాయకత్వం, ప్రజల ఆలోచనలకు అనుగుణంగా తొలుత ఏప్రిల్ 6 నుండి 15 వరకు పనులు గుర్తించాలన్నారు. ఏప్రిల్ 16 నుండి 20 వరకు ఏయే పనులు చేపట్టాలి, వాటికి అనుమతులు ఎలా సాధించాలి అంశంపై దృష్టి సారించాలన్నారు. అనంతరం ఏప్రిల్ 21 నుండి జులై 9 వరకు మంజూరైన పనులను అమలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. జులై 10 నుండి 14 వరకు సిద్ధం చేసుకున్న యాక్షన్ ప్లాన్‌ను ఏమేర సాధించామో సంబంధిత నివేదికను ప్రభుత్వానికి పంపించాల్సి ఉంటుందని వివరించారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ నియోజకవర్గంలో ఉన్న చిన్న సాగు నీటి చెరువుల పునరుద్ధరణ వాటిని సక్రమంగా వినియోగంలోకి తీసుకు రావాలని సూచించారు. చెరువులోకి నీరు చేరే కాలువలను శుభ్రపరచాలన్నారు. చెరువుల కట్టను బలోపేతం చేయాలన్నారు. సమీపంలోని కాలువలను చెరువులతో అనుసంధానం చేయాలన్నారు. వరద నీరు, వర్షపు నీరు ను చెరువుల్లోకి మళ్లించేలా చర్యలు చేపట్టాలన్నారు. నీటి మరియు నేల తేమ సంరక్షణ నిర్మాణాలను పెంచాలన్నారు. తద్వారా భూగర్భజలాల పెంపు జరుగుతుందన్నారు. నీటి సంరక్షణ విధానాన్ని కచ్చితంగా అమలు చేసి తీరాలన్నారు. పచ్చదనం పెంచేందుకు కృషి చేయాలన్నారు. కొత్త నీటి సంరక్షణ నిర్మాణాలు చేపట్టాలన్నారు. ప్రతి గ్రామానికి నీటి భద్రత ప్రణాళిక, ప్రత్యేక నీటి బడ్జెట్ ను సిద్ధం చేయాలన్నారు. వీటన్నింటిని పూర్తిస్థాయిలో అమలు చేసే దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. సాగునీటి శాఖ, వ్యవసాయ, ఉద్యాన, అటవీ, భూగర్భ జల తదితర శాఖల సమన్వయంతో ముందుకు వెళ్లాలన్నారు. ఇది ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రాం అని తెలిపారు. ఇందుకు అవసరమైన నిధుల సమీకరణను సాధించే దిశగా కృషి చేద్దామన్నారు. కేవలం కాగితాల మీద ప్రణాళికలు కాకుండా, క్షేత్రస్థాయిలో పనులు కనిపించాలని చెప్పారు.సాగునీటి సంఘాల ప్రతినిధులు కేవలం పర్యవేక్షకులుగా కాకుండా, ఈ యజ్ఞంలో భాగస్వాములుగా మారి రైతులకు అండగా నిలవాలని సూచించారు.గ్రామ స్థాయిలో ఉన్న ప్రతి నీటి వనరును గుర్తించి, వాటిని పునరుద్ధరించడానికి యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలి పేర్కొన్నారు. నీటి సంరక్షణ అనేది కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదు, ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత. ప్రజల సహకారం ఉంటేనే ఏ కార్యక్రమమైనా విజయవంతమవుతుందని ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఈ కార్యక్రమం విస్తృత స్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత అందరిపై ఉందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ల మార్గదర్శకత్వంలో సాగునీటి రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడమే కూటమి ప్రభుత్వ సంకల్పమని మంత్రి కందుల దుర్గేష్ ఈ సందర్భంగా తెలిపారు. ఈ సమావేశంలో పెరవలి ఎంపీడీవో కేయుఆర్ఎల్ పద్మజ, పెరవలి తహసిల్దార్ నిరంజన్, ఉండ్రాజవరం ఎంపీడీవో ఉమా రాజ్యలక్ష్మి పద్మజ, తహసిల్దార్ ప్రసాద్, నిడదవోలు ఎంపీడీవో జగన్నాథ్‌రావు మరియు తహసిల్దార్ నాయక్ పాల్గొన్నారు. వీరితో పాటు మూడు మండలాల నీటి సంఘాల ప్రెసిడెంట్లు సురేంద్ర, పుల్లా శేఖర్, సత్యనారాయణ, రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా జలవనరుల శాఖ డీఈఈ జి.మనోజ్ కుమార్, నరసాపురం ఇరిగేషన్ డీఈఈ సీహెచ్ వెంకటనారాయణ, ఇతర అధికారులు, కూటమి నాయకులు, మండలాల అధ్యక్షులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మూలాపేట పోర్టును పరిశీలించిన మంత్రులు అచ్చెన్నాయుడు, బీసీ జనార్ధన్ రెడ్డి

**శ్రీకాకుళం, (రాజధాని వార్తలు):** శ్రీకాకుళం జిల్లాలో మూలాపేట గ్రీన్ ఫీల్డ్ పోర్టులో జరుగుతున్న అభివృద్ధి పనులను సోమవారం నాడు వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడుతో కలిసి పర్యవేక్షించిన పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి. ఈ సందర్భంగా పోర్టులో జరుగుతున్న అభివృద్ధి పనుల తీరుతెన్నులను ప్రత్యేకంగా పరిశీలించిన మంత్రులు. అనంతరం పోర్టు పనుల పురోగతిపై అధికారులతో సమీక్షించిన మంత్రులు. పోర్టు పురోగతి పనులను మరింత వేగవంతం చేయాలని మంత్రులు ఆదేశం. ఈ ఏడాది చివరి నాటికి పోర్టు పనులను పూర్తి చేసి ఆపరేషన్లు ప్రారంభించడమే లక్ష్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చిన మంత్రులు. మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ...మూలపేట గ్రీన్ ఫీల్డ్ పోర్ట్ నిర్మాణంతో శ్రీకాకుళం జిల్లా ప్రజల చిరకాల వాంఛ తీరనుంది. పోర్టు నిర్మాణంలో పెండింగ్ సమస్యలు ఇంకా ఇతర సమస్యలపై చర్చించడం జరిగింది. ఎప్పటిలోపు పనులు పూర్తిగా పూర్తవుతాయని అంశంపై చర్చించాం. దాదాపు రూ. 4361.91 కోట్లతో చేపట్టిన మూలాపేట పోర్టు పనుల్లో.. ఫేజ్ 1 లో 1524 ఎకరాల్లో 4 బెర్తల నిర్మాణం చేపట్టాం. తొలుత 2025 అక్టోబర్ నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ. భూసేకరణ వంటి అనివార్య కారణాలతో 2026 నవంబర్ నాటికి పోర్టును ప్రారంభించాలన్న దృఢ నిశ్చయంతో పనిచేస్తున్నాం. మూలాపేట పోర్టు ఉత్తరాంధ్రలో వ్యూహాత్మకంగా కీలక స్థానంలో ఉంది. ఈ పోర్టు నిర్మాణంతో ఆంధ్ర ప్రదేశ్‌తో పాటు తీర ప్రాంతం లేని, సరిహద్దు రాష్ట్రాలైన చత్తీస్ ఘడ్, జార్ఖండ్, మధ్యప్రదేశ్..దక్షిణ ఒడిస్సా ప్రాంతాలకు ఇది అత్యంత అందుబాటులో ఉండే పోర్టు కావడం కలిసొచ్చే అంశం. మూలపేట పోర్టుపై నేడు వైసీపీ నేతలు దుష్ప్రచారం చేస్తున్న క్రమంలో ప్రజలకు వాస్తవాలు తెలియజేయాల్సిన బాధ్యత తమపై ఉంది. రోజుకో అజెండా.. పూటకో ఈవెంట్‌తో వైసిపి నేతలు తమ కరపత్రికను అడ్డుపెట్టుకుని కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారు. సీఎం చంద్రబాబు ప్రతి మూడు నెలలకు ఒకసారి పోర్టుల పురోగతిపై రివ్యూ చేస్తూ ఉన్నారు. 2024 జూన్ నాటికి పోర్టు భౌతిక పురోగతి.. మొత్తం 25.02% గా ఉండగా.. ప్రస్తుతం 74.65 % పనులు శరవేగంగా పూర్తి చేశామని చెప్పగలం.. గత 20 నెలల్లో దాదాపు 49.63 % పనులు పూర్తి చేశాం. బ్రేక్‌వాటర్ పనులు జూన్ 2024 నాటికి 28.9% పూర్తయితే గత 20 నెలల్లో 63.48 % శాతం పూర్తి చేశాం.. మొత్తంగా 92.38 % శాతం పనులు పూర్తి చేశాం. డ్రెడ్జింగ్ & రిక్లమేషన్ పనులు జూన్ 2024 నాటికి 37.8% పూర్తయ్యితే గత 20 నెలల పాలనలో 51.91% పనులు పూర్తి చేశాం..మొత్తంగా ఇప్పటి వరకు 89.71% పనులు పూర్తయ్యాయి. బెర్తలకు సంబంధించి జూన్ 2024 నాటికి 26.3% శాతం పనులు పూర్తయితే, గత 20 నెలల్లో 51.53% పనులు పూర్తి చేశాం.. మొత్తంగా 77.83% పనులు పూర్తయ్యాయి.. ఆన్‌షోర్ మౌలిక వసతులు వైసీపీ హాయాంలో ప్రారంభమే కాలేదు.. గత 20 నెలల్లో దాదాపు 13.65% పనులు పూర్తి చేశాం. బాహ్య మౌలిక వసతులు కల్పన పనులకు సంబంధించి 2024 జూన్ నాటికి 2.3% పూర్తయితే గత 20 నెలల్లో 29.39% పూర్తి చేశాం.. మొత్తంగా ఇప్పటి వరకు 31.69 % పనులు పూర్తయ్యాయి.. ఆర్థిక పురోగతి 2019--24 లో రూ. 718.50 కోట్లు వైసీపీ ప్రభుత్వం ఖర్చు చేస్తే.. ప్రస్తుతం రూ. 1835.98 కోట్ల మేర పనులు చేపట్టడం జరిగింది.. మొత్తంగా గత 20 నెలల పాలనలో రూ. 1117.48 కోట్లు వెచ్చించడం జరిగింది.



పోర్టుకు సంబంధించి ఉప్పు భూముల సేకరణ విషయంలో నాటి వైసీపీ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఎటువంటి ప్రయత్నం చేసిన పాపాన పోలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, 385.24 ఎకరాల భూసేకరణకు అనుమతి పొందడం జరిగింది. గత వైసీపీ ప్రభుత్వంలో మూలాపేట, విష్ణుచక్రం గ్రామాల్లో పునరావాసం కోసం సీరియస్‌గా ఎటువంటి చర్యలు చేపట్టలేదు.. గత 20 నెలల కూటమి ప్రభుత్వంలో విష్ణుచక్రం గ్రామంలో పూర్తిగా పునరావాసం కల్పించడం జరిగింది. అలాగే మూలపేట గ్రామంలో పునరావాసం పనులు ఇప్పటికే పురోగతిలో ఉన్నాయి. అదే సమయంలో పునరవాసనకు సంబంధించి తాగునీరు కోసం పైప్ లైన్లు, స్వచ్ఛభారత్ కింద టాయిలెట్లు నిర్మాణం, ట్రాన్స్కో, రైల్వే లైన్ వంటి సమస్యలను తమ దృష్టికి తీసుకు వచ్చారు. నేపాడ జంక్షన్లో ఫ్లైఓవర్ ఏర్పాటుకు అధికారులతో చర్చించాం. గత 20 నెలలు వైసీపీ నేతలు నిద్రపోయారా అని నేను ప్రశ్నిస్తున్నా. నేడు మూలపేట నిర్మాణం పూర్తవుతున్న క్రమంలో 20 నెలల తర్వాత వైసీపీ నేతలు రాజకీయం చేస్తున్నారు. గత 20 నెలలు వైసీపీ నేతలు నిద్రపోయారా. రాజకీయ ఉనికి కోల్పోతున్న క్రమంలోనే రోడ్లపై కొచ్చి చలో మూలపేట పేరుతో డ్రామాలాడుతున్నారుగతంలో వైసీపీ నేతలు ఉత్తరాంధ్ర రాజధాని అంటే బుద్ధి చెప్పి వైసీపీ నేతలకు గుండు సున్నా చుట్టిన విషయం మర్చిపోవద్దు. నేడు మూలాపేట పోర్టును అధికారులు ప్రతినిత్యం సమీక్షిస్తున్నారు. మూడు నెలలకు ఒకసారి ప్రత్యేకంగా సీఎం పురోగతిపై చర్చిస్తున్నారు. కేవలం శంకుస్థాప నలకే పరిమితమయ్యే వైసిపి..నేడు పనులు పూర్తవుతున్న క్రమం లో.. అది తమ క్రెడిట్ అని చెప్పుకునే దౌర్భాగ్య స్థితికి వచ్చింది. అమరావతి విషయంలోనూ తొలుత 30 వేల ఎకరాలు కావాలని జగన్మోహన్ రెడ్డి అన్నారు. ఆ తర్వాత తాడేపల్లిలో నేను కూడా ఇల్లు కట్టుకున్నాను ఇదే రాజధాని అన్నారు. అధికారం చేపట్టాక మాట మార్చి రాజధాని పేరుతో మూడుముక్కలాటాడారు. అమరావతినీ ఒకడు స్మశానమంటే.. మరొకడు నదీగర్భంలో ఉందన్నాడు.. వైసీపీ నేతలకు అభివృద్ధి తెలియదు.. విధ్వంసం మాత్రమే తెలుసు. ఇటువంటి నాయకులు తమకు అవసరం లేదని రాష్ట్ర ప్రజలు ప్రతిపక్ష హోదా కూడా దక్కకుండా చేశారు. జూలై, ఆగస్టు నెలలో ప్రధాన మంత్రి ఆధ్వర్యంలో భోగాపురం ఎయిర్పోర్ట్ పూర్తి చేసి జాతికి అంకితం చేస్తాం. ఏ ప్రాజెక్టు అయినా నేను శంకుస్థాపన చేశాను.. మా నాన్న శంకుస్థాపన చేశాడు.. అంటూ రాజకీయాలు చేసే నీచ స్థాయికి వైసిపి దిగజారిపోయింది.

# రాష్ట్రంలో ఎల్పీజీ నిల్వలు సరపడా ఉన్నాయి - ప్రజలెవరూ ఆందోళనతో బుకింగ్స్ చేయొద్దని విన్నపం

**విజయవాడ, (రాజధాని వార్తలు):** రాష్ట్రంలో ఎల్పీజీ నిల్వలు సరపడా ఉన్నాయని, ప్రజలెవరూ ఆందోళనతో బుకింగ్స్ చేయొద్దని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ డైరెక్టర్ శ్రీవాస్ నుపుర్ అజయ్ కుమార్, సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసేందుకు కావాల్సిన అన్ని చర్యలు తీసుకుంటున్నాయని తెలియజేశారు. రాష్ట్రంలో నిరంతరాయ ఎల్పీజీ గ్యాస్, ఇంధన సరఫరాకు తీసుకుంటున్న చర్యలతో పాటు ఎరువులు, రసాయనాల నిల్వలకు సంబంధించిన సమాచారాన్ని తెలియజేసేందుకు సోమవారంనాడు విజయవాడలోని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఇందులో.. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ డైరెక్టర్ శ్రీవాస్ నుపుర్ అజయ్ కుమార్, ఐఏఎస్ తో పాటుగా కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన పత్రికా సమాచార కార్యాలయం (పీఐబీ) - విజయవాడ డైరెక్టర్ జీ.సురేష్ కుమార్, వీడీవీ కృపాదాస్, జేడీఏ, విత్తనాలు & ఎరువుల శాఖ, ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం, భాస్కర రెడ్డి - జీఎమ్-ఎస్ఎల్సీ, విజయవాడ రిటైల్ ఆర్ఓ పాల్గొన్నారు.

సమావేశంలో వెల్లడించిన అంశాలు:

ఎల్పీజీ, పీఎన్జీ సరఫరా రాష్ట్ర వ్యాప్తంగా ఎల్పీజీ సరఫరాను నిరంతరం పర్యవేక్షిస్తున్నాము, ప్రస్తుతం మన వద్ద 14,000 మెట్రిక్ టన్నుల ఎల్పీజీ నిల్వలు సిద్ధంగా ఉన్నాయి. ప్రతిరోజు సగటున 4 వేల మెట్రిక్ టన్నుల గృహ వినియోగ ఎల్పీజీ సరఫరా చేస్తున్నాము, వినియోగదారులందరికీ 100 శాతం ఇంటికే వచ్చి డెలివరీ అందజేస్తాము. విద్యా సంస్థలు, హాస్టళ్లకు ఎల్పీజీ సరఫరాలో మొదటి ప్రాధాన్యత ఇస్తూ పూర్తి స్థాయిలో గ్యాస్ అందిస్తున్నాము. వాణిజ్య అవసరాల కోసం గత వినియోగంలో సగటున 70 శాతం (186 మెట్రిక్ టన్నులు) సరఫరా చేస్తున్నాము; రానున్న రోజుల్లో హోటళ్లు, రెస్టారెంట్లకు ఈ సరఫరాను మరింత పెంచనున్నాము. 5 కేజీల సిలిండర్ల సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు లేవు; కేవలం మార్చి నెలలోనే 5 కేజీల సిలిండర్లు మొత్తం 7,560 ప్రజలకు అందించాము. తప్పుడు సమాచారం వల్ల ప్రజలు భయాందోళనతో పెద్ద ఎత్తున బుకింగ్స్ చేస్తున్నారు; గతంలో రోజుకు 2 లక్షల బుకింగ్స్ ఉండగా, ప్రస్తుతం 2.5 లక్షల వరకు బుకింగ్స్ జరుగుతున్నాయి. అయినా.. సరఫరా అందుతోంది. గ్యాస్ బుకింగ్ రద్దీని నియంత్రించడానికి పట్టణ ప్రాంతాల్లో బుకింగ్ వ్యవధిని 21 రోజుల నుండి 25 రోజులకు, గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజులకు మార్చడం జరిగింది. పానిక్ బుకింగ్స్ వల్ల ప్రస్తుతం డెలివరీకి 4 నుండి 6 రోజులు సమయం పడుతోంది; పౌరులు ఆందోళన చెందవద్దని, గోడౌన్ల దగ్గరకు వెళ్లాల్సిన అవసరం లేదని, ఆన్‌లైన్ ద్వారానే బుక్ చేసుకోవాలని కోరుతున్నాము. ప్రతి గ్యాస్ ఏజెన్సీ వద్ద ఒక సూపర్‌వైజరీ ఆఫీసర్‌ను, బాటిలింగ్ ప్లాంట్ల వద్ద డివిజన్ లెవల్ అధికారులను పర్యవేక్షణ కోసం నియమించాము. బ్లాక్ మార్కెటింగ్‌ను అరికట్టడానికి ప్రతి జిల్లాలో అత్యవసర ప్రతిస్పందన బృందాలను ఏర్పాటు చేశాము; మార్చి 1 నుండి ఇప్పటివరకు 1,705 కేసులు నమోదు చేసి, 4,377 సిలిండర్లను సీజ్ చేశాము. దేశీయంగా లభ్యతను పెంచడానికి రిఫైనరీల నుండి ఎల్పీజీ ఉత్పత్తిని 20% నుండి 25% వరకు పెంచడం జరిగింది. గ్యాస్ సరఫరా అంతరాన్ని తగ్గించడానికి పైప్డ్ న్యాచురల్ గ్యాస్ నెట్‌వర్క్‌ను ప్రభుత్వం విస్తరిస్తోంది, అత్యవసర అవసరాల కోసం 2,000 ఖూ కిరోసిన్‌ను సిద్ధంగా ఉంచాము. హోటళ్లు, రెస్టారెంట్లు, దేవాలయాలు సహా భారీ పరిశ్రమలు వంటివి పైప్డ్ నేచురల్ గ్యాస్ కనెక్షన్‌లకు మారాలని ప్రభుత్వం విజ్ఞప్తి చేస్తోంది. ఈ మార్పును వేగవంతం చేయడానికి పరిశ్రమలు, పెట్టుబడుల శాఖ కీలక సంస్కరణలను ప్రవేశపెట్టి, తగిన ఉత్తర్వులను జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా PNG మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయడానికి ఐదు సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ సంస్థలు ప్రస్తుతం పనిచేస్తున్నాయి. PNG డెవలపర్లకు అవసరమైన అనుమతులను త్వరగా మంజూరు చేయాలని అన్ని జిల్లాల కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ అయ్యాయి. 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' లో



భాగంగా, PNG మౌలిక సదుపాయాలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులన్నీ క్లియర్ అయినట్లుగా పరిగణించబడతాయి. కొత్త దరఖాస్తులను 24 గంటల్లోనే పరిష్కరించేలా 'సింగిల్ విండో' క్లియరెన్స్ వ్యవస్థను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. భవిష్యత్తులో గ్యాస్ సరఫరాలో ఎదురయ్యే ఆటంకాలను, అంతర్జాతీయ ఇంధన మార్కెట్ ఒడిదుడుకులను తట్టుకోవడానికి PNG కి మారడం అనేది ఒక దీర్ఘకాలిక వ్యూహంగా ప్రభుత్వం భావిస్తోంది. మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్న చోట ప్రజలు, పరిశ్రమలు పైప్డ్ గ్యాస్ కనెక్షన్‌లు తీసుకోవాలని ప్రభుత్వం కోరుతోంది. 'దీపం 2' పథకం కింద అర్హులైన లబ్ధిదారులకు సంవత్సరానికి మూడు ఎల్పీజీ సిలిండర్ల రీఫిల్స్‌పై సబ్సిడీని ప్రభుత్వం అందిస్తోంది. దీపం పథకం లబ్ధిదారులందరికీ ఈ ప్రయోజనాలు అందేలా చూడటంతో పాటు, గృహ అవసరాలకు ఇంధన భద్రత కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది.

**ఎరువులు, రసాయనాలు**

ఖరీఫ్‌లో మనకి దాదాపుగా 15 లక్షల 50 వేల టన్నుల వివిధ రకాల రసాయనిక ఎరువులు అవసరం అవుతాయి. కేంద్రంతో చర్చలు జరిపి 18 లక్షల టన్నులకు కేటాయింపులు పొందాము. ఏప్రిల్ 1 నాటికి 7.33 లక్షల వివిధ రకాల ఎరువులు అందుబాటులో ఉన్నాయి. రాష్ట్రంలో యూరియా 6.5 లక్షల మెట్రిక్ టన్నులు అవసరం కాగా, 7.5 లక్షల మెట్రిక్ టన్నుల కేటాయింపులు పొందాము. ఏప్రిల్ 1 నాటికి రాష్ట్రంలో 2 లక్షల 15 వేల మెట్రిక్ టన్నులు నిల్వలున్నాయి. ఇవి మొత్తం నిల్వల్లో 47%- 48% నికి సమానం. ప్రస్తుతం వ్యవసాయ సీజన్ కాకపోవడం వల్ల జూన్ వరకు ఎరువుల అవసరం ఉండదు. కాబట్టి ఈ మూడు నెలల సమయంలో నిల్వల్ని పెంచేందుకు ప్రయత్నాలు చేస్తున్నాం. ముఖ్యంగా రాష్ట్రంలో రైతులు ఎక్కువగా వినియోగించే యూరియా 1.33 లక్షల మెట్రిక్ టన్నుల అవసరం అవుతుంది. ఐతే.. కేంద్రం నుంచి 2.30 లక్షల మెట్రిక్ టన్నుల కేటాయింపులు సాధించాం, వాటి సరఫరా కోసం ప్రయత్నాలు చేస్తున్నాం. రానున్న మూడు నెలల్లో రాష్ట్రానికి వచ్చే స్టాక్ కలుపుకుంటే.. పూర్తి స్థాయిలో రైతులకు సరఫరా చేసేందుకు కావాల్సిన నిల్వలు అందుబాటులోకి వస్తాయి. ఆ తర్వాత వ్యవ సాయ సీజన్ ప్రారంభమైయ్యాక మూడు నెలల పాటు డిమాండ్ ఎక్కువగా ఉంటుంది. అప్పటికి సరఫరాలో అంతరాయం లేకుండా చూడొచ్చు. 50 శాతం ఎరువుల్ని మార్క్ ఫెడ్ దగ్గర నిల్వ ఉంచుతాం. మార్క్ ఫెడ్ దగ్గర. 1.20 లక్షల మెట్రిక్ టన్నుల బఫర్ స్టాక్ ఉండాల్సి ఉండగా, ప్రస్తుతం గోడౌన్లల్లో 90 వేల మెట్రిక్ టన్నుల నిల్వలు అందుబాటులో ఉన్నాయి. రాష్ట్రంలో అందుబాటులో ఉన్న ఎరువులు సరిహద్దులు దాటించకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాం. యూరియా, ఇతర ఎరువుల తయారీకి గ్యాస్ అవసరం ఉంటుంది. దేశీయంగా సరపడా గ్యాస్ నిల్వలు లేకపోవడంతో దిగుమతులపైనే ఆధారపడాల్సిన పరిస్థితిలో.. ఎరువులకు కొంత ఇబ్బంది పరిస్థితి ఉన్నా, కేంద్ర ప్రభుత్వం నిరంతర ప్రయత్నాలతో కావాల్సిన ఎరువుల్ని సమకూర్చుకోగలిగాం. ఇప్పటికే.. కొన్ని నౌకలు ఎరువులతో తీర ప్రాంతానికి చేరుకున్నాయి. వాటిలో నుంచి కేటాయింపుల సాధించేందుకు కేంద్రంతో సంప్రదింపులు జరుపుతున్నాం.

# అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో విద్యాబోధన అందించాలి

## - ప్రతి విద్యార్థి తెలుగు, ఇంగ్లీష్, హిందీ ధారాళంగా చదవగలగాలి - ప్రాథమిక స్థాయిలోనే విద్యార్థుల పునాది పటిష్టం కావాలి : జిల్లా కలెక్టర్ డా.ఎన్.ప్రభాకర రెడ్డి

**పార్వతీపురం, (రాజధాని వార్తలు):** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో విద్యాబోధన అందించాలని డా.ఎన్.ప్రభాకర రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రతి విద్యార్థి తెలుగు, ఇంగ్లీష్, హిందీ ధారాలంగా చదవడంతో పాటు గణితంలో కూడా పట్టు సాధించేలా చర్యలు చేపట్టాలని అధికారులకు కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. ఇందుకోసం ప్రాథమిక స్థాయిలోనే విద్యార్థులకు పటిష్టమైన పునాది వేయడమే లక్ష్యంగా పనిచేయాలని హితవు పలికారు. శనివారం కలెక్టరేట్‌లో జిల్లాలోని ఐటీడీఏ అధికారులతో విద్య, వైద్యం, మౌలిక వసతులు వంటి పలు అంశాలపై జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. విద్యార్థుల చదువుపై స్పష్టమైన అంచనా కోసం మౌఖిక పరీక్షలను నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ఇందుకోసం సంబంధిత గ్రామం లేదా పంచాయతీ పరిధిలో చదువుకున్న విద్యావంతులను బాహ్య పరీక్షకులుగా నియమించాలన్నారు. ప్రతి విద్యార్థి తెలుగు మరియు ఇంగ్లీష్ అక్షరాలను, పదాలను స్పష్టంగా గుర్తించేలా శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. మన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో పోటీ పడేలా ఉపాధ్యాయులు బోధన సాగించాలని హితవు పలికారు. ఇందుకోసం జూన్ నెల నుండి ప్రత్యేక పర్యవేక్షణ వ్యవస్థ అమలులోకి వస్తుందని ఆయన తెలిపారు. విద్యా వ్యవస్థలో మార్పు అంగన్‌వాడీల నుండే ప్రారంభం కావాలని, ఒకటి నుండి ఐదవ తరగతి వరకు ప్రతి తరగతి లోనూ విద్యార్థులు ఆయా స్థాయికి తగిన అభ్యసన సామర్థ్యాలను కలిగి ఉండాలని స్పష్టం చేశారు. ఆశించిన స్థాయిలో ఫలితాలు సాధించని పాఠశాలల ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్ నిర్వహించాలని, అవసరమైతే ఉన్నత స్థాయి అధికారుల ద్వారా పర్యవేక్షణ పెంచాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ విద్యా సంవత్సరం ముగిసే లోగా విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలలో స్పష్టమైన మార్పు రావాలని, వచ్చే విద్యా సంవత్సరం నాటికి జిల్లాలోని అన్ని ప్రాథమిక పాఠశాలలు ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలోని ప్రతి విద్యార్థి మన విద్యార్థే అని గుర్తెరిగి విద్యార్థుల నాణ్యత విషయంలో రాజీ పడకూడదని స్పష్టం చేశారు. గురుకులాల పాఠశాలల తనిఖీ నివేదికలు, ఏపీఓల రివ్యూలు సక్రమంగా ఉండాలని, తనిఖీ చేసే అధికారం ఉన్నవారు ఖచ్చితంగా విజిట్ చేయాలని ఆదేశించారు. 4వ తరగతి నుండి విద్యార్థులందరికీ తెలుగు, ఇంగ్లీష్ వార్తా పత్రికలు చదవడం రావాలన్నారు. 1 నుండి 10వ తరగతి విద్యార్థులందరికీ వార్తా పత్రికలు లేదా కథల పుస్తకాలు చదవడం అలవాటు చేయాలని తెలిపారు. అలాగే హిందీలో ప్రాథమిక, మాధ్యమిక స్థాయిలను పూర్తి చేయాలని సూచించారు. గణితంలో కూడా నైపుణ్యం సాధించాలని, ప్రతీ విద్యార్థి కూడికలు, తీసివేతలు వంటి ప్రాథమిక అంశాలు నోటితోనే చెప్పగలిగేలా ఉండాలని అన్నారు. 100 లోపు ఏ రెండు అంకెలు ఇచ్చినా విద్యార్థులు వెంటనే లెక్కించి చెప్పేలా ఉండాలని, దీని కోసం 'స్పీడ్ మ్యాథ్స్' యాప్స్ లేదా వెబ్‌సైట్‌లను ఉపయోగించి విద్యార్థులకు శిక్షణ ఇవ్వాలని కోరారు. విద్యార్థులు చదవడంతో పాటు మానసిక వికాసం కోసం పద్యాలు, పాటలు పాడటం వంటివి కూడా నేర్చుకోవాలని పేర్కొన్నారు. 1 నుండి 5 తరగతుల విద్యార్థులకు ఆటపాటలతో కూడిన విద్యతో పాటు ఇతర వినోద కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఉపాధ్యాయులు కేవలం పాఠాలు చెప్పడం కాకుండా, ఖాన్ అకాడమీ వంటి ఆన్‌లైన్ వనరులు మరియు యూట్యూబ్ వీడియోల ద్వారా విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా బోధించాలని తెలిపారు. విద్యార్థి దశ నుంచే కమ్యూనికేషన్ స్కిల్స్ (నైపుణ్యాలు) పెంపొందించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. ప్రతి పాఠశాలలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తరగతి గదులు, టాయిలెట్లు, తాగునీరు వంటి మౌలిక సదుపాయాలు ఉండాలని ఆదేశించారు. పాఠశాలల్లో ఆహారం, యూనిఫాం, ఇతర విభాగాల పనితీరును క్రమం తప్పకుండా సమీక్షించాలని సూచించారు. విద్యార్థులను మానసికంగా దృఢంగా తయారు చేయడం ద్వారా వారిలో ఆత్మవిశ్వాసం పెరిగి ఏ పనైనా సులభంగా చేయగలరని పేర్కొన్నారు. పదవ తరగతి పూర్తయిన విద్యార్థులందరూ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోనే చేరేలా చర్యలు తీసుకోవాలని, ఏ ఒక్క విద్యార్థి కూడా ప్రైవేట్ కళాశాలలకు వెళ్లరాదని సూచించారు. విద్యా సంస్థల్లో నెలకు ఒకసారి ఏదైనా ఒక అంశంపై 'మన్ కీ బాత్' వంటి కార్యక్రమాన్ని నిర్వహించాలని పేర్కొన్నారు. ఆశ్రమ పాఠశాలలను ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ కేంద్రాలుగా మార్చాలని, కిచెన్ వేస్ట్ నుండి ఎరువుల తయారీ, మొక్కల పెంపకం (నర్సరీ), బొకేల తయారీ వంటి వాటి ద్వారా ఆదాయం పొందేలా శిక్షణ ఇవ్వాలని తెలిపారు. నాణ్యమైన స్టిచ్చింగ్ ఉండేలా మాస్టర్ ట్రైనర్ల ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించాలని అన్నారు. ప్రతి శుక్రవారం ఏఎన్ఎం, సైన్స్ టీచర్లు ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించాలని సూచించారు. ఐటీడీఏ పరిధిలో బాల్య వివాహాలు జరగరాదని, వివాహాల సమాచారం పీఓలకు ముందుగా అందజేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గిరిజన ప్రాంతాల్లో వైద్యానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, అంబులెన్సు వెళ్ళని ప్రాంతాలు ఉండరాదని అన్నారు. అలాగే ప్రకృతి వ్యవసాయం దిశగా రైతులు మొగ్గు చూపేలా, యాంత్రీకరణ వినియోగించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ప్రతి ఆరోగ్య కేంద్రంలో సుఖ ప్రసవాలు జరగాలని, గర్భం దాల్చిన నాటి నుంచి సుఖః ప్రసవం అయ్యేవరకు గర్భిణీలు తీసుకోవలసిన జాగ్రత్తలు, చేయాల్సిన ఎక్సర్ సైజులపై అవగాహన కల్పించాలని అన్నారు. కొత్తగా నిర్మించిన భవనాలన్నీ ముస్తాబు కావాలని, అన్ని మౌలిక వసతులు ఉండాలన్నారు. పీజీఆర్ఎస్ వచ్చిన సమస్యలు పరిష్కారం అయ్యేలా చూడాలని, ముస్తాబు గ్రామాలకు తొలి ప్రాధాన్యత ఇచ్చి అన్ని పరిష్కరించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, సీతంపేట ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి పవార్ స్వప్నిల్ జగన్నాథ్, ఏపీఓ పి.మురళీధర్, ఉపసంచాలకులు ఎ. విజయ శాంతి, జిల్లా విద్యా శాఖాధికారి పి.బ్రహ్మాజీరావు, ఇతర ఐటీడీఏ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# సంపాదకీయం

## మావిగన్.. మారీచ!

'ఊరందరిదీ ఒక దారి అయితే ఉలిపి కట్టెది మరో దారి' అని అంటారు. అమరావతిని మాత్రమే ఆంధ్రప్రదేశ్ రాజధానిగా నిర్ణయిస్తూ కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టిన బిల్లును కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు అన్ని రాజకీయ పార్టీలూ ఏకాభిప్రాయంతో ఆమోదించగా, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ప్రతిపక్ష పార్టీ వైసీపీ మాత్రం వ్యతిరేకించడం ఈ సామెతను గుర్తుచేస్తున్నది. రాష్ట్రం ఏర్పడిన 12 ఏళ్ల తర్వాత మా రాజధాని ఇది అని అధికారికంగా చెప్పుకోవలసి రావడమే దౌర్భాగ్యం అనుకుంటే సదరు బిల్లును కూడా వ్యతిరేకించడాన్ని ఏమనుకోవాలి? పిచ్చికి మందు ఉంటుంది గానీ అసూయ, ద్వేషాలకు మందు ఉండదు. రాష్ట్ర రాజధానిగా అమరావతిని నిర్ణయిస్తూ లోక్ సభలో బిల్లు ఆమోదం పొందుతున్న సమయంలోనే తాను మళ్లీ అధికారంలోకి వస్తే రాజధానిని మారుస్తానని ప్రకటించడంతో పాటు మచిలీపట్నం-విజయవాడ-గుంటూరును కలిపి 'మావిగన్' పేరిట రాజధానిని ఏర్పాటు చేసుకోవచ్చునని మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చేసిన ప్రకటనతో రాష్ట్ర ప్రజలే కాకుండా వైసీపీ నాయకులు కూడా నిర్ఘాంతపోయారు. అమరావతి అనే పేరు ఉచ్చరించడానికి కూడా జగన్‌రెడ్డి ఎందుకు ఇష్టపడటం లేదో తెలియదు. అమరావతిలో మౌలిక సదుపాయాలు కల్పించడానికి రెండు లక్షల కోట్ల రూపాయలు అవసరమని, అంత డబ్బును ఒకేచోట ఖర్చు చేస్తే మిగతా ప్రాంతాల పరిస్థితి ఏమిటని ఆయన పాత పాటనే అందుకున్నారు. అమరావతి నిర్మాణానికి రాష్ట్ర బడ్జెట్ నుంచి ఒక్క రూపాయి కూడా కేటాయించడం లేదు. రైతులు ఉదారంగా ఇచ్చిన భూములను అభివృద్ధి చేసి విక్రయించడం ద్వారా వచ్చిన డబ్బుతోనే మౌలిక సదుపాయాలు, నిర్మాణాలు చేపడుతున్నారు. అమరావతి అనేది సెల్ఫ్ సస్టెయినబుల్ ప్రాజెక్టు అని తెలిసి కూడా గతంలో చేసిన దుష్ప్రచారాన్ని జగన్‌రెడ్డి మళ్లీ మొదలుపెట్టారు. ఇలాంటి అసంబద్ధ ఆలోచనలు, నిర్ణయాలు, చర్యల వల్ల గత ఎన్నికల్లో చావుదెబ్బ తిన్నప్పటికీ తమ నాయకుడి వైఖరిలో మార్పు రాకపోవడాన్ని వైసీపీకి, జగన్‌కు మద్దతుగా నిలుస్తున్న బుద్ధిజీవులు కూడా జీర్ణించుకోలేకపోతున్నారు. గతంలో జరిగిందేదో జరిగిపోయింది, ఇకనైనా రాజధాని గురించి మాట్లాడకపోవడం మంచిది అని పలువురు సలహాలు కూడా ఇస్తున్నారు. అయినా ఇవేవీ పట్టని జగన్‌రెడ్డి ఇప్పుడు మూడు రాజధానులను పక్కనపెట్టి 'మావిగన్' అనే కొత్త పేరును తెరపైకి తెచ్చారు. ఈ పేరు చెబుతున్నప్పుడు ఆయన స్వరంలో అంతులేని వెటకారం ధ్వనించింది. అమరావతి విషయంలో జగన్‌రెడ్డి వైఖరి వెల్లడి అయిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు అదృష్టవంతుడు అని మరోమారు రుజువైంది. జగన్‌రెడ్డి వంటి వ్యక్తి రాజకీయ ప్రత్యర్థిగా ఉండటాన్ని మించిన అదృష్టం ఏముంటుంది? 2024 ఎన్నికల్లో చంద్రబాబు బంపర్ మెజారిటీతో అధికారంలోకి రావడానికి కారణం ఏమిటి? తెలుగుదేశం-జనసేన-బీజేపీ ఒక కూటమిగా ఏర్పడటమా? లోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్రా? చంద్రబాబు జైలుకు వెళ్లడమా? లేక చంద్రబాబు రాజకీయ వ్యూహాలా? ఇవేవీ కావు- అప్పుడు ముఖ్యమంత్రిగా ఉండిన జగన్మోహన్‌రెడ్డి ప్రజాస్వామ్య వ్యవస్థలో ఒక ముఖ్యమంత్రి ఎలా వ్యవహరించకూడదో అలా వ్యవహరిస్తూ అరాచకాలను పెంచి పోషించడం ద్వారా చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయడానికి శక్తివంచన లేకుండా కృషి చేశారు. 2019కి పూర్వం జగన్‌రెడ్డి ఎలాంటి వారో, ఆయన నైజం ఎటువంటిదో ప్రజలకు తెలియదు. దివంగత రాజశేఖరరెడ్డి కుమారుడిగా ఆయనను అభిమానించారు. జగన్‌రెడ్డిలో రాజశేఖరరెడ్డిని చూసుకున్నారు. ఈ కారణంగానే 2019 ఎన్నికల్లో 151 సీట్ల భారీ మెజారిటీని జగన్ రెడ్డికి కట్టబెట్టారు. ఇక అప్పటి నుంచి జగన్‌రెడ్డి నిజస్వరూపం వెల్లడవుతూ వచ్చింది. ప్రజలకు ఆయన ఏమిటో బోధపడింది. కక్షలు, కార్పణ్యాలు, అసూయా ద్వేషాలతో ఐదేళ్లపాటు సాగించిన పాలనతో ప్రజలకు తత్వం బోధపడింది. ఫలితమే బంపర్ మెజారిటీతో కూటమి అధికారంలోకి వచ్చింది. సరే జరిగిపోయిందేదో జరిగిపోయింది అని ఎన్నికల్లో ఓడిపోయిన పార్టీలు ఆత్మపరిశీలనకు ఉపక్రమిస్తాయి. తప్పు ఎక్కడ జరిగిందో గుర్తించి దిద్దుబాటు చర్యలు తీసుకుంటాయి. సదరు పొరపాటు మళ్లీ జరగబోదని ప్రజలను నమ్మించే ప్రయత్నం చేస్తాయి. జగన్‌రెడ్డి ఈ ప్రాథమిక సూత్రాన్ని కూడా పట్టించుకోవడం లేదు. రాజకీయాల్లో అయినా, మరెందులో అయినా వైఫల్యాలను గుణపాఠాలుగా మలచుకొని ఎదగడానికి ప్రయత్నించడం సహజం. అయితే తాను అనుకున్నదే నిజమని నమ్మే జగన్‌రెడ్డి మరో అభిప్రాయం వినడానికే ఇష్టపడరు. ఈ క్రమంలో హైహై నాయకా అనే భజనపరులే ఆయన చుట్టూ ఏర్పడ్డారు. అధికారంలో ఉన్నప్పుడు ప్రజా వ్యతిరేకత ఆయన దృష్టికి వెళ్లకుండా పరదాలు కప్పారు. 2019 ఎన్నికలతో పోలిస్తే ప్రజల్లో జగన్‌కు మద్దతు పెరిగిందని నమ్మబలికారు. 2019లో దాదాపు యాభై శాతం ఓట్లతో అధికారంలోకి వచ్చిన జగన్ బలం 55 శాతం దాటిందని తాము భ్రమించడమే కాకుండా జగన్‌రెడ్డిలోనూ భ్రమలు కల్పించారు. ప్రజలకు డబ్బు పంచితే గంపగుత్తగా ఓట్లు పడతాయని కాకి లెక్కలు వేసుకున్నారు. ఈ భజన బృందం మాటలు నమ్మిన జగన్‌రెడ్డి 'వై నాట్ 175' అనే నినాదాన్ని ఎత్తుకున్నారు. ఎన్నికల ఫలితాల తర్వాత డామిట్ కథ అడ్డం తిరిగింది అని తెలిసి కూడా నెపాన్ని ఈవీఎంలపై తోసే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తి కావస్తోంది. ఇంకేముందీ ప్రజల్లో కూటమి ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత ఏర్పడిందని, మూడేళ్లు కళ్లు మూసుకుంటే జగన్‌రెడ్డి మళ్లీ అధికారంలోకి వస్తారని చిడతలు కొట్టడం మొదలెట్టారు. జగన్ పర్యటనల సందర్భంగా కృత్రిమ హడావిడికి రూపకల్పన చేస్తున్నారు.

# గర్భవతులకు సామూహిక శ్రీమంతాలు

**- ఆరోగ్యకరమైన బిడ్డల కోసం కులాకార్ బియ్యం పంపిణీ - ఆకట్టుకున్న చేతివృత్తులు, వెదురు ఇల్లు - ప్లాస్టిక్, ఫ్లెక్సీలు లేకుండా శబల భోజనాలు**





**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** శబల భోజనాల పండుగలో భాగంగా ఆరోగ్యకరమైన సమాజం నిర్మాణం కోసం గర్భవతులకు సామూహిక శ్రీమంతాలు సేవ్ సంస్థ వ్యవస్థాపకులు విజయరాం నేతృత్వంలో నిర్వహించారు. శనివారం ఉదయం సింహాచలం దేవస్థానానికి చెందిన గోశాల వద్ద సేవ్ సంస్థ, సంకల్ప కళా గ్రామం వ్యవస్థాపకులు ఆకుల చలపతిరావు, తులసి నేచురల్స్ సత్యనారాయణలో నేతృత్వంలో నాల్గవ రోజు శబల భోజనాల పండుగ నిర్వహించారు. దేశంలో ఆరోగ్యకరమైన బిడ్డల కోసం గర్భవతులకు కులాకార్ బియ్యం పంపిణీ చేశారు. అలాగే ఇక్కడ నిర్వహించిన చేతివృత్తులు, వెదురు ఇల్లు అందరినీ ఆకట్టుకున్నాయి.

ప్లాస్టిక్, ఫ్లెక్సీలు లేకుండా శబల భోజనాల పండుగ నిర్వహించడం విశేషం. మట్టి కుండలతో మంచి నీరు అందుబాటులో ఉంచారు. ప్రధానంగా ధనియాలు, సోంపు, జీలకర్ర, లవంగాలు, జాజి కాయ, యాలకులు, దాల్చినచక్క, పచ్చ కర్పూరం, వట్టి వేరు, నిమ్మకాయల రసం కలిపిన నీరు అందుబాటులో ఉంచారు. గోవర్ధన గిరి మహేష్ తీసుకు వచ్చిన దేశీయ ఆవులు చూడడానికి అధిక సంఖ్యలో తరలి వచ్చారు. అలాగే విత్తనాలు, ప్రకృతి ఆధారంగా పండించిన పంటలు అమ్మడం జరిగింది. ఈ కార్యక్రమంలో బొబ్బిలి ఎమ్మెల్యే బేబీ నయన, విఎంఆర్డిఎ చైర్మన్ ప్రణవ్ గోపాల్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ నాగలక్ష్మి, ఎసిపి మణికంఠ, ఎసిబి డిఎస్పీ హర్షిత, జిల్లా పర్యాటక శాఖ అధికారి మాధవి, జి విఎంసి సిఎం ఒ. నరేష్ కుమార్, ప్రకృతి వైనం ప్రసాద్, విశ్వమానవతా సంస్థ వ్యవస్థాపకులు అల్లూరి శ్రీనివాసరావు, సర్వాయి సంస్థ శైలేంద్ర, ఎయు అల్యూమిని అసోసియేషన్ ప్రతినిధి వఫీరా, పంచగవ్య రామకృష్ణ, విద్యా వేత్త ఇంద్రాణి, యోగా గురువు ఆర్ఎంవి సత్యనారాయణ, సంకల్ప కళా గ్రామం జమీలియా తదితరులు పాల్గొని మాట్లాడారు. ప్రకృతి రైతు పిఎల్ ఎన్ రాజు, ఉత్తరాంధ్ర జర్నలిస్ట్ ఫ్రంట్ అధ్యక్షులు ఎంఆర్ఎన్ వర్మ, మేంగొమేన్ అప్పాజీ, గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం అధ్యక్షులు దాట్ల సుబ్రహ్మణ్య వర్మ, కోకో అండ్ కేన్ రాజశేఖర్, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం తదితరులు పాల్గొన్నారు.

# యుద్ధం వద్దు.. శాంతి ముద్దు

**- మృతి చెందిన జర్నలిస్టులకు ఘనంగా నివాళులు - ఏపీలో పాత్రికేయుల ఇళ్ల స్థలాల కోసం తీవ్ర ప్రయత్నాలు - ప్రమాద బీమా పునరుద్ధరించండి : జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల**



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధములో పలువురు జర్నలిస్టులు మృతి చెందడం పట్ల ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ తీవ్ర సంతాపం వ్యక్తం చేసింది. శనివారం విశాఖ జిల్లా కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న ఏపీ ఎన్జీవో హోంలో వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ బ్రాడ్ కాస్ట్ స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్‌లు సంయుక్త కార్యవర్గసమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి ఎన్ఏజే ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు గంట్ల శ్రీనుబాబు విశాఖ జిల్లా అధ్యక్షులు పి నారాయణ ప్రధానకార్యదర్శి జి శ్రీనివాసరావులు మాట్లాడుతూ పశ్చిమాసియాలో జరుగుతున్న యుద్ధం వల్ల ప్రపంచ వ్యాప్తంగా కోట్లాదిమంది ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అలాగే ధరల భారం పెరిగి ఎంతో మంది నిరుపేదలు రోడ్డున పడుతున్నారన్నారు. విధి నిర్వహణలో వీర జవాన్లతో పాటు అధికారులు అనేకమంది జర్నలిస్టులు మృతి చెందడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా యుద్ధంలో మృతి చెందిన జర్నలిస్టుల పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని అలాగే వారి కుటుంబాలకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నామన్నారు.

**ఇళ్ల స్థలాల కోసం విశ్వ ప్రయత్నాలు**

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న జర్నలిస్టులకు తక్షణమే ప్రభుత్వ పరంగా ఇళ్ల స్థలాలు ఇండ్లు కేటాయించాలని ఇందుకోసం తమ యూనియన్ పరంగా తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నామని జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు నారాయణలు తెలిపారు. త్వరలోనే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మంత్రి నారా లోకేష్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లను కలిసి ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతామన్నారు. అలాగే జర్నలిస్టులకు ఎంతో ఉపయోగకరమైన ప్రమాద బీమా పాలసీని పునరుద్ధరించాలని వెటరన్ జర్నలిస్టులకు జిల్లా కేంద్రాల్లో బస్సు సదుపాయం కల్పించాలని చిన్న మధ్య పత్రికలకు సంబంధించిన ఎం ప్యానల్ మెంట్ సమస్యను పరిష్కరించాలని ఇప్పటికే సమాచార శాఖ మంత్రిని కోరినట్లు వీరు చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాసరావు, ఫెడరేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీధవళేశ్వర్ రవి కుమార్, ఉపాధ్యక్షులుపక్కి వేణు, బ్రాడ్ కాస్ట్ అధ్యక్ష కార్యదర్శి ఈరోతి ఈశ్వరరావు, కింతాడ మదన్, స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్ అధ్యక్షులు జగన్మోహన్, కార్యవర్గ ప్రతినిధులు బొబ్బర ప్రసాద్, శర్మ, హరి, రవి, అప్పలనాయుడు, రమేష్, నెల రాజు, రంగ ధామం, తదితరులంతా పాల్గొన్నారు.

# తిరుమల పవిత్రతను కాపాడాలి

**- పదవికి కళంకం తెచ్చిన బి.ఆర్.నాయుడుని తొలగించాలి - చర్యలు తీసుకోకుండా ప్రభుత్వ ప్రేక్షక పాత్ర - బిఆర్ నాయుడుని తొలగించే వరకు పోరాటం : వైఎస్ఆర్సిపి దక్షిణ సమన్వయకర్త మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్**



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** తిరుమల పవిత్రతకు కళంకం తెచ్చిపెట్టిన టిటిడి చైర్మన్ బి ఆర్ నాయుడుని ప్రభుత్వం తక్షణమే తొలగించాలని విశాఖ దక్షిణ నియోజకవర్గం వైసీపీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ డిమాండ్ చేశారు. వైసిపి అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు టీటీడీ చైర్మన్ పదవి నుండి బీర్ నాయుడును తొలగించాలని డిమాండ్ చేస్తూ దక్షణ నియోజకవర్గంలోని పలు ప్రాంతాలలో నిర్వహించిన నిరసన కార్యక్రమాలలో ఆయన పాల్గొన్నారు. 38వ వార్డు కంచర వీధిలో వెంకటేశ్వర స్వామి ఆలయం దర్శించి, పూజలు చేసిన అనంతరం గోసాల ఆస్పత్రి రాములవారి ఆలయం వద్ద జరిగిన వినూత్న కార్యక్రమంలో వాసుపల్లి గణేష్ కుమార్ మాట్లాడుతూ చేతకాని కూటమి ప్రభుత్వం వల్ల టీటీడీ చైర్మన్ బిఆర్ నాయుడు తన పదవికి కళంకం తెచ్చే పనులు చేపడుతున్నారని ఆరోపించారు. రెడ్ హ్యాండెడ్‌గా ఒక మహిళతో ఆయన అసభ్యకర రీతిలో ఉన్న వీడియోలు బయట పడినప్పటికి కూడా ప్రభుత్వం ఆయనపై ఎటువంటి చర్యలు తీసుకోకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందని మండిపడ్డారు. బి ఆర్ నాయుడుకు మంచి పదవి ఇవ్వాలంటే టీటీడీ చైర్మన్ పదవి నుండి తొలగించి మరొక పదవిని ఆయనకు ఇచ్చి, అతనిని నెత్తి మీద కూర్చో పెట్టుకోవచ్చని ఎద్దేవా చేశారు. ప్రధాన ఆరోపణలు ఎదుర్కొంటున్న బిఆర్ నాయుడు పట్ల కనీస విచారణ జరగకుండా, ఆయనకు పూర్తిగా చంద్రబాబు నాయుడు వత్తాసు పలకడం విచారకరమని పేర్కొన్నారు. ఇలా ప్రభుత్వంలో ఎవరు తప్పులు చేసినా వారిని వెనుకేసుకు రావడం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు అలవాటయింది అని అన్నారు. అయితే ప్రజలు అన్ని గమనిస్తున్నారని, కచ్చితంగా వచ్చే ఎన్నికలలో తమ ఓటుతో గట్టిగా బుద్ధి చెబుతారని హెచ్చరించారు. తమ పార్టీ అయితే చంద్రబాబు నాయుడు ప్రభుత్వం చేస్తున్న ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ఎండగడుతుందన్నారు. ప్రజల పక్షాన పోరాటం చేస్తుందని చెప్పారు. అలాగే టీటీడీ చైర్మన్ పదవి నుంచి బి ఆర్ నాయుడును తొలగించే వరకు తమ ఉద్యమం కొనసాగుతుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి సుభాష్ కుటుంబ సభ్యుల వారాహి మాతకు ప్రత్యేక పూజలు



**కరప, (రాజధాని వార్తలు):** రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ కుటుంబ సభ్యులు శనివారం కరప మండలం కొరుపల్లి గ్రామం పరిధిలో కాశీ వారాహి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంత్రి సుభాష్ సతీమణి, ఇద్దరు పిల్లలు, ఆయన తల్లిదండ్రులు కొరుపల్లి గ్రామంలోని చిక్కాల దొరబాబు నిర్మించిన కాశీ వారాహి అమ్మవారి ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. తాము కోరుకున్న ఒక ముఖ్యమైన కార్యక్రమం విజయవంతంగా పూర్తి కావడంతో దేవికి కృతజ్ఞతగా ఆలయానికి వచ్చి పూజలు చేసినట్లు మంత్రి సుభాష్ తండ్రి సత్యం తెలిపారు. ఆలయ ధర్మకర్త చిక్కాల దొరబాబు, అర్చకులు చెరుకూరి సుబ్బన్నలను సత్కరించి, శేషవస్త్రాలు, ప్రసాదం, పట్టుచీరలను బహుకరించారు. ఆలయ అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని కుటుంబ సభ్యులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానికులు, భక్తులు పాల్గొన్నారు.

# రూ.5 కోట్లతో మంచినీరు చెరువు అభివృద్ధి



**అల్లవరం, (రాజధాని వార్తలు):** అల్లవరం మండలం కొమరగిరి పట్నం గ్రామ ప్రజల మంచి నీటి అవసరాలను తీర్చేందుకు రూ. 5 కోట్లతో మంచినీటి చెరువు అభివృద్ధి పనులు జరుగుతున్నాయని ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు అన్నారు. శనివారం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ రాకాపు విజయలక్ష్మి, ఉప సర్పంచ్ గుర్రం శ్రీను, కార్యవర్గ సభ్యుల సన్మాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంపీపీ మాట్లాడుతూ కొమరగిరి పట్నం ప్రజలు ఆదరణతోనే గెలుపొందానని ప్రజల సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి బాటలో నడిపించా మని తెలిపారు. పంచాయితీ ప్రత్యేక అధికారి మేడిద నారాయణరావు, కార్యదర్శి చిక్కం శ్రీను, ఆధ్వర్యంలో జరిగిన సన్మాన కార్యక్రమంలో సర్పంచ్ విజయ లక్ష్మి మాట్లాడుతూ ప్రజల ఆదరణతోనే గ్రామంలో పలు అభివృద్ధి పనులు చేపట్టామని అన్నారు. నా ఐదు సంవత్సరాల పదవి కాలంలో ప్రజల నుండి వచ్చిన సమస్యలను పరిష్కరించామని అన్నారు. త్రాగునీటి సమస్యను పూర్తిస్థాయిలో పరిష్కరించామని తెలిపారు. కరోనా రెండు సంవత్సరాలు ప్రజలకు ఏ ఇబ్బంది కలగకుండా గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచి అభివృద్ధి బాటలో నడిపించామని ఆన్నారు. కేరళ నుండి వచ్చిన బృందం రాష్ట్రంలో ఎంపిక చేసిన 24 పంచాయతీలలో ఒకటిగా కొమరగిరిపట్నం పంచాయతీ ఐఎస్ఓ సర్టిఫికెట్‌కు ఎంపిక చేసిందని ఇది ప్రజల సహకారంతో సాధించగలిగామన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు నడింపల్లి సీతారామరాజు, అల్లూరి సురేష్ రాజు, ఎంపీటీసీలు పెచ్చెట్టి వెంకటేశ్వరరావు, మామిడిశెట్టి శ్రీనివాస్, సహకార సంఘం మాజీ అధ్యక్షులు గుని శెట్టి రోహిణి కుమార్, పరసా కిరణ్ కుమార్, నిమ్మకాయల శేఖర్, దండు బుజ్జి, దాట్ల బుజ్జి రాజు, బీహెచ్ రాజు, పోచనపెద్ది పెద్ది వెంకటేష్, నల్లా రాము సిబ్బంది పాల్గొన్నారు.

# సిసి రహదారి పనులకు శంకుస్థాపన చేసిన కూటమి నేతలు



**అల్లవరం, (రాజధాని వార్తలు):** గ్రామాలలో రహదారులు, మౌలిక వసతులు కల్పనకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని కూటమి నాయకులు అన్నారు. అల్లవరం పంచాయతీ పరిధిలో గొల్లల వీధి సిసి రోడ్డు నిర్మాణ పనులకు శనివారం కూటమి నేతలు శంకుస్థాపన చేసారు. గత ప్రభుత్వ కాలంలో అధ్వానంగా మారిన గ్రామాల రహదారులను నేడు కూటమి ప్రభుత్వం నిర్మిస్తుందని అన్నారు. అల్లవరం మండల టిడిపి నాయకులు బండి గుప్తాపు సత్తిబాబు, జనసేన పార్టీ మండల నాయకులు కంకిపాటి వీరబాబు, బిజెపి మండల నాయకులు ఆత్మ డైరెక్టర్ సంకర సాయి, మాజీ సర్పంచ్ బొమ్మ బాలువేణి, సొసైటీ అధ్యక్షులు కంకిపాటి గోపి నీటిసంఘం ప్రెసిడెంట్ బొక్కా ప్రసాదు, వైస్ ప్రెసిడెంట్ బండి గుప్తాపు, వీరపండు, గ్రామ కమిటీ అధ్యక్షులు మామిడిశెట్టి రాజు, బండి గుప్తాపు చిట్టివెంకన్న, కటారి. సుబ్బారావు, రాసూరి రాంబాబు, విన్న సత్యం, నిచ్చును కోళ్ల వెంకట్, వాసర్ల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# శేష్ పంచ్.. ఆ హీరో ఫీలయ్యారా?



టాలీవుడ్ యంగ్ హీరోల మధ్య పోటీ, పోలికలు ఎప్పుడూ చర్చనీయాంశంగానే ఉంటాయి. తాజాగా అడివి శేష్ చేసిన కొన్ని వ్యాఖ్యలు, వేసిన పంచులు హాట్ టాపిక్‌గా మారాయి. ఆయన చేసిన కామెంట్స్ వల్ల మరో యంగ్ హీరో గురించి ఊహాగానాలు మొదలయ్యాయి.

అయితే ఆ వ్యాఖ్యలతో సంబంధం లేకపోయినా, కొందరు ఓ హీరో పేరును లాగ డంతో ఆయన అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. విభిన్న కథలను ఎంచుకుంటూ తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న అడివి శేష్, హీరోగా మాత్రమే కాకుండా రైటర్‌గా సినిమాల్లో కీలక పాత్ర పోషిస్తున్నారు. ప్రస్తుతం ఆయన నటిస్తున్న డెకాయిట్ ఏప్రిల్ 10న విడుదలకు సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో ప్రమోషన్స్‌లో భాగంగా ఓ పోడ్ కాస్ట్‌లో పాల్గొన్న శేష్ పలు వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా ఓ యంగ్ హీరో గురించి చేసిన కామెంట్స్ చర్చకు దారితీశాయి. "ఓ యాక్టర్ పేరు చెప్పను. నా ప్రొడ్యూసర్ బర్త్ డే సందర్భంగా కలిశా. 'నువ్వు నా కంటే పెద్ద సినిమా చేశావు' అన్నట్టుగా షేక్ హ్యాండ్ ఇచ్చాడు. అతను చెప్పింది తెలుగులో చెబితే ఎవరో అర్థమైపోతుంది. అందుకే ఇంగ్లీష్‌లో చెబుతున్నా" అని శేష్ అన్నారు. ఆ మాటలు విన్నప్పుడు అదొక రకమైన పోలికల పోటీలా అనిపించిందని చెప్పారు. "యంగ్ హీరోల్లో టాప్ అవ్వాలనుకుంటే ముందు పెద్ద హీరోలు ఉన్నారు. వారిని దాటాలని అనుకుంటే రజనీకాంత్, చిరంజీవి లాంటి లెజెండ్స్ ఉన్నారు. వారిని మించి వెళ్లాలని అనుకుంటే షారుఖ్ ఖాన్ ఉన్నారు.


ఇంకా ఆయనకన్నా టాప్ కావాలంటే టామ్ క్రూజ్ ఉన్నారు. పోలికలు ఎక్కడికి తీసుకెళ్తాయి?" అంటూ తన అభిప్రాయం వెల్లడించారు.

# పర భాష నటుల కామెంట్స్‌పై జేడీ ఒపీనియన్ ఇదీ!



టాలీవుడ్ ఆర్టిస్ట్‌లని విస్మరిస్తూ కొంత మంది డైరెక్టర్లు, నిర్మాతలు పరభాషలకు చెందిన నటీనటులని ఎక్కువగా తెలుగు కోసం తీసుకొస్తున్నారని, దాని వల్ల తెలుగులో ఉన్న టాలెంటెడ్ ఆర్టిస్ట్‌లకు పని లేకుండా పోతోందనే కామెంట్‌లు చాలా కాలంగా వినిపిస్తున్నాయి. కోట శ్రీనివాసరావు లాంటి నటులు బాహాటంటానే దీనిపై కామెంట్‌లు చేశారు. ప్రకాష్ రాజ్‌లాంటి పరభాష నటులని ప్రోత్సహిస్తున్నారని, ఇది మంచి పద్ధతి కాదని విమర్శలు గుప్పించారు. తాజాగా ఇదే తరహా ప్రశ్న జెడీ చక్రవర్తికి ఎదురైతే ఆయన ఆసక్తికరంగా స్పందించారు. చాలా కాలంగా తెలుగు సినిమాలకు దూరంగా ఉంటూ వస్తున్న జెడీ చక్రవర్తి తెలుగులో తరుణ్ భాస్కర్ కథానాయకుడిగా నటించిన గాయపడ్డ సింహంలో నటించారు. మే 1న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా మేకర్స్ హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో జేడీ చక్రవర్తి పాల్గొని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తెలుగు ఆర్టిస్ట్‌లను పక్కన పెట్టి పరభాష నటులను తీసుకుంటున్నారు అన్నది కరెక్ట్ కాదు. మాలాంటి నటులను ముందుగా అప్రోచ్ అయినా మాలాంటి వాళ్లు కొన్ని సార్లు నో చెప్పడం వలన వేరే భాష నటులకు వెళ్లివుండవచ్చు అన్నారు. లేదా కొన్ని సందర్భాలలో ఆ క్యారెక్టర్‌కు వాళ్లు మాత్రమే సరిపోతారని భావించి దర్శకుడు తీసుకున్న నిర్ణయం కూడా అయివుండోచ్చు. అంతే కానీ మన తెలుగువాళ్లని పక్కన పెట్టి పరభాష నటుల కోసం వెళుతున్నారు అనేది కరెక్ట్ కాదు. క్యారెక్టర్ ఫిట్‌నెస్ అనేది ఒకటి ఉంటుంది. కొన్ని క్యారెక్టర్లకు దర్శకుడు ఎవరిని అనుకుంటున్నారో వాళ్లే సరిపోతారు అన్నారు. ఇదే సందర్భంగా థియేటర్స్‌ని టెంపుల్స్ అంటారు కదా? దీనిపై మీ ఒపీనియన్ అని అడిగితే తనదైన శైలిలో స్పందించారు. థియేటర్ టెంపుల్ అయితే మీరు స్నానం చేసే థియేటర్స్‌కు వెళుతున్నారా?..గాళ్ ఫ్రెండ్‌తో పక్కన కూర్చుని సినిమా చూస్తున్నారా? ..టెంపుల్‌లో ఇవన్నీ చేస్తారా ఎవరైనా? థియేటర్ అనేది ఒక క్రియేటివ్ ప్లేస్. అక్కడికి వెళ్లి ఎంటర్‌టైన్ అవ్వాలనుకుంటారు. టెంపుల్‌కి ఎంటర్‌టైన్‌మెంట్‌కి వెళతామా? ఇది ఏంటంటే చెప్పుకోవడానికి బాగుంటాయిని కాయినింగ్ చేస్తుంటారు. ఆ సౌండింగ్ నచ్చి మిగతావాళ్లు ఫాలో అవుతారు అంటూ సెటైర్లు వేశారు. జెడీ చక్రవర్తి వేసిన సెటైర్లు ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతున్నాయి.

# బ్లాక్ అవుట్ ఫిట్‌లో హీట్ పుట్టిస్తున్న దిశాపటాని!



అవకాశాలతో పని లేకుండా సోషల్ మీడియా ద్వారా పాపులారిటీని పెంపొందించుకుంటూ తమ అందంతో ఊహించని క్రేజ్ సొంతం చేసుకుంటున్న హీరోయిన్స్ ఈ మధ్యకాలంలో ఎక్కువే అని చెప్పాలి. ముఖ్యంగా కొంతమంది యూట్యూబ్ ద్వారా ఆదాయాన్ని ఘడిస్తుంటే.. మరికొంతమంది ఇలా ఇంస్టాగ్రామ్, ట్విట్టర్ వేదికగా అందాలు ఆరబోస్తూ ఆదాయాన్ని పెంపొందించుకుంటు న్నారు. అంతేకాదు కొన్ని బ్రాండ్లను ప్రమోట్ చేస్తూ ఈ సోషల్ మీడియా ఫ్లాట్ ఫామ్ వేదికగా ఊహించని క్రేజ్ అందుకుంటున్న విషయం తెలిసిందే. ఇకపోతే కొంతమంది వరుస సినిమాలతో బిజీగా ఉంటూనే మరొకవైపు అభిమానులను ఆకట్టుకోవడానికి గ్లామర్ వలకబోస్తూ సోషల్ మీడియాను పునాదిగా వేసుకుంటున్నారు. అలాంటి వారిలో ప్రముఖ బాలీవుడ్ బ్యూటీ దిశాపటాని కూడా ఒకరు. ప్లేస్‌తో సంబంధం లేకుండా గ్లామర్ వలకబోయడమే ప్రధానంగా చేసుకుంటూ అందంతో ఆకట్టుకునే ఈ ముద్దుగుమ్మ.. తాజాగా బ్లాక్ అవుట్ ఫిట్‌లో అందాలు ఆరబోస్తూ ప్రేక్షకులలో హీట్ పెంచే ప్రయత్నం చేసింది. అసలే సమ్మర్ పైగా బ్లాక్ డ్రెస్ ధరించి సెగలు పుట్టించే గ్లామర్ వలకబోస్తూ దిశాపటాని షేర్ చేసిన ఫోటోలు సోషల్ మీడియాలో మంట రాజేస్తున్నాయి. దిశాపటాని బాలీవుడ్ నటి అయినప్పటికీ అవకాశం లభించింది మాత్రం తెలుగులోనే.. తొలిసారి లోఫర్ సినిమాతో సినిమా ఇండస్ట్రీలోకి నటిగా అడుగు పెట్టింది.. పూరీ జగన్నాథ్ దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమాలో మౌని అనే పాత్ర పోషించి ప్రేక్షకులను మెప్పించింది. అటు బాలీవుడ్‌లో ఎంఎస్ ధోని ది అన్ టోల్డ్ స్టోరీ సినిమాతో బాలీవుడ్ రంగ ప్రవేశం చేసి మొదటి సినిమాతోనే అక్కడ ఊహించని క్రేజ్ సొంతం చేసుకుంది. తెలుగు, హిందీ మాత్రమే కాదు 2017లో చైనీస్ భాషలో సినిమా చేసి అలరించిన దిశాపటాని ఇక హిందీలోనే సినిమాలు చేస్తూ వచ్చింది. అటు సినిమాలతో పాటు ఇటు మ్యూజిక్ వీడియోస్‌లో కూడా కనిపించిన ఈ ముద్దుగుమ్మ .. తన చిత్రాలతో పలు అవార్డులను కూడా దక్కించుకుంది దిశా పటాని. ఇకపోతే పలు ఇంటర్వ్యూలలో పాల్గొంటూ ఎన్నో విషయాలను పంచుకునే దిశాపటాని గతంలో తన ఫస్ట్ క్రష్ గురించి కూడా చెప్పుకు వచ్చింది.

దిశాపటాన్ని మాట్లాడుతూ.. నేను స్కూల్లో ఉన్నప్పుడు రణబీర్‌కు పెద్ద అభిమానిని. ఆయన పోస్టర్ చూస్తూ ఎన్నోసార్లు ప్రమాదంలో పడాల్సిన పరిస్థితి వచ్చింది..మా నగరంలో ఆయనకు సంబంధించిన పెద్ద పెద్ద పోస్టర్లు ఉండేవి ఇక ఆయనను చూస్తూ అలా ఉండిపోయే దాన్ని అంటూ దిశాపటాని తెలిపింది. దిశాపటాని ఇటు సిని మాలతోనే కాదు అటు వ్యక్తిగతంగా కూడా రూమర్స్ ఎదు ర్కొంటోంది. తల్వీందర్‌తో ఈమె ప్రేమలో ఉన్నట్లు గత కొన్ని రోజులుగా వార్తలు వినిపిస్తున్న విషయం తెలిసిందే. దీనికి తోడు జనవరి 25న ఈ లోలాపలుజా ఇండియా 2026లో తల్వీందర్ చేతులు పట్టుకొని మరి బయటకు రావడం అందర్నీ ఆశ్చర్యపరిచింది. ఏది ఏమైనా దిశా పటాని ఇలా వ్యక్తిగత, వృత్తిపరమైన విషయాలతో వార్తల్లో నిలుస్తోంది.

# అలా మాట్లాడితే జాన్వీకి కోపం వస్తుందట..!



బాలీవుడ్, టాలీవుడ్, కోలీవుడ్ అనే తేడా లేకుండా దేశంలోని అన్ని భాషల ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేసి, అభిమాన హీరోయిన్‌గా నిలిచిన అతిలోక సుందరి శ్రీదేవి నట వారసురాలిగా జాన్వీ కపూర్ ఎంట్రీ ఇచ్చింది. శ్రీదేవికి ఇద్దరు కుమార్తెలు, ఇద్దరూ హీరోయిన్స్‌గానే ఇండస్ట్రీలో ఉన్నారు. అయినా కూడా అంతా జాన్వీ కపూర్ గురించి మాట్లాడుకుంటారు. అందుకు కారణం ఆమె అందం, ఆమె సోషల్ మీడియా పోస్ట్‌లు అనడంలో ఎలాంటి సందేహం లేదు. బాలీవుడ్‌లో హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చి చాలా కాలం అయినా కమర్షియల్ బ్రేక్ దక్కించుకోలేక పోయిన జాన్వీ కపూర్ సోషల్ మీడియాలో షేర్ చేసే అందమైన ఫోటోల కారణంగా వార్తల్లో నిలుస్తుంది. దాంతో హీరోయిన్‌గా ఆఫర్లను దక్కించుకుంటూ ఉంటుంది. జాన్వీ కపూర్ గురించి సినిమాల్లో కంటే సోషల్ మీడియాలో ఎక్కువగా ఉంటుంది అనే విమర్శ ఉంది. అయినా పట్టించుకోకుండా జాన్వీ కపూర్ తన పని తాను చేసుకుంటూ వెళ్తుంది. జాన్వీ కపూర్ ఫోటోలు రెగ్యులర్‌గా సోషల్ మీడియాలో వైరల్ కావడం మనం చూస్తూ ఉంటాం. తన ఫోటో షూట్ ఫోటోలను జాన్వీ స్వయంగా ఇన్‌స్టాగ్రామ్ ద్వారా షేర్ చేయడం లేదంటే, ఏదైనా కార్యక్రమంకు వెళ్లిన సమయంలో మీడియా ఫోటోగ్రాఫర్లకు ఫోజ్‌లు ఇవ్వడం ద్వారా సోషల్ మీడియాలో వైరల్ అవుతూ ఉంటుంది. జాన్వీ కపూర్ ఎక్కువగా పాపరాజీల దృష్టిని ఆకర్షించే విధంగా ఔట్ ఫిట్‌ను ధరిస్తుంది అనే టాక్ కూడా ఉంది. గతంలో పలు సార్లు పాపరాజీల గురించి పాజిటివ్‌గా మాట్లాడిన జాన్వీ కపూర్ తాజాగా ఒక చిట్ చాట్ సందర్భంగా వారు అప్పుడప్పుడు చేసే వ్యాఖ్యలపై అసహనం వ్యక్తం చేసింది. సందర్భానుసారంగా తాను ధరించిన డ్రెస్‌ను పాపరాజీలు ఇష్టానుసారంగా ఫోటోలు తీసుకుని, అందంగా లేదు అంటూ కామెంట్ చేయడంపై ఆమె తాజా చిట్ చాట్‌లో స్పందించింది. తన ఫోటోలను కొన్ని యాంగిల్స్‌లో చూసి పాపరాజీలు, నెటిజన్స్ 'ఈమె హాట్‌గా లేదు, అందంగా లేదు' అంటూ కామెంట్ చేయడం వంటివి చేస్తే కోపం వస్తుందని జాన్వీ కపూర్ చెప్పుకొచ్చింది. తన గురించి ఇతరులు మాట్లాడుకోవడం పర్వాలేదు కానీ, తన గురించి పదే పదే నెగిటివ్‌గా మాట్లాడుకోవడం కోపం తెప్పిస్తుందని జాన్వీ కపూర్ అంది. తాను ఎన్నో ఫోటో షూట్స్‌లో హాట్‌గా అందంగా కనిపించాను. కొన్ని ఫోటోలను యాంగిల్ లేకుండా తీసి, ఇష్టానుసారంగా పోస్ట్ చేసిన పాపరాజీల ఫోటోలను చూసి కొందరు హాట్‌గా లేదని వ్యాఖ్యలు చేయడం ఏమాత్రం కరెక్ట్ కాదు అన్నట్లుగా జాన్వీ కపూర్ అసహనం వ్యక్తం చేసింది. కంఫర్ట్ లేకుండా రకరకాల యాంగిల్స్ నుంచి ఫోటోలు తీయడం అనేది ఇబ్బందిగా అనిపిస్తుంది. ఆ ఫోటోలను వారు హాట్‌గా లేదని కామెంట్ పెట్టి పోస్ట్ చేయడంను జాన్వీ కపూర్ తప్పుబట్టింది. జాన్వీ కపూర్ గత ఏడాది మూడు హిందీ సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఆ మూడు సినిమాలు సైతం తీవ్రంగా నిరాశ పరిచాయి. గత ఏడాది జాన్వీ కపూర్‌కి శృంగార తారగా మరింత గుర్తింపు దక్కింది. కానీ ఎప్పటిలాగే హిట్ మాత్రం దక్కలేదు. కానీ జాన్వీ కపూర్ ఈ ఏడాది పై చాలా ఆశలు పెట్టుకుంది. ఒకటి రెండు బాలీవుడ్ సినిమాలకు సంబంధించిన చర్చలు జరుగుతున్నాయి.

మరోవైపు రామ్‌చరణ్‌తో నటించిన పెద్ది సినిమా విడుదలకు ముస్తాబు అవుతుంది. బుచ్చిబాబు దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమాలో జాన్వీ కపూర్ పాత్రకు ఎక్కువ ప్రాధాన్యత ఉండబోతున్నట్లుగా ఇప్పటి వరకు విడుదలైన పాటలను బట్టి అర్థం అవుతుంది. ఇప్పటికే జాన్వీ కపూర్ లుక్‌కి, ఆమె యొక్క బాడీ లాంగ్వేజ్‌కి మంచి స్పందన వచ్చింది. సినిమా హిట్ అయితే జాన్వీ కపూర్ టాలీవుడ్‌లో మోస్ట్ వాంటెడ్ హీరోయిన్‌గా, అత్యధిక పారితోషికం తీసుకునే హీరోయిన్‌గా మారే అవకాశం ఉంది. మరో వైపు బాలీవుడ్ లోనూ ఈమె బిజీ అయ్యే అవకాశాలు ఉన్నాయి.

# బి ఆర్ నాయుడిని తొలగించాలి... తిరుమల పవిత్రతను కాపాడాలి : మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి






**రావులపాలెం, (రాజధాని వార్తలు):** టీటీడీ చైర్మన్ బిఆర్ నాయుడును పదవి నుంచి తొలగించి తిరుమల తిరుపతి దేవస్థానం పవిత్ర తను కాపాడాలని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రావులపాలెం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయం వద్ద ఉన్న ఆంజనేయస్వామి గుడిలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించి నిరసన కార్యక్రమాన్ని ప్రారంభించారు. బి ఆర్ నాయుడును బర్తరఫ్ చేయాలంటూ శాంతియుతంగా నిరసన తెలియజేస్తున్న మహిళలపై దాడికి పాల్పడటమే కాకుండా, బాధితులైన మహిళా నేతలపైనే తప్పుడు కేసులు పెట్టడం ప్రభుత్వ నిరంకుశత్వానికి నిదర్శనం అన్నారు. బి.ఆర్ నాయుడు చైర్మన్ అయిన తర్వాత తిరుమల తిరుపతి దేవస్థానంలో తొక్కిసలాటలు, జరగరాని అనర్థాలు జరుగుతున్నాయని ఆయన వెనుక ఉండి కాపాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలుసుకొని ఆయన్ని వెంటనే చైర్మన్ పదవి నుండి తొలగించా లని డిమాండ్ చేశారు. అనంతరం జాతీయ రహదారిపై బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా అమ లాపురం పార్లమెంట్ పరిశీలకురాలు జక్కంపూడి విజయలక్ష్మి, మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు, ముఖ్య నాయకులు ప్రజాప్రతి నిధులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# లక్ష్మీపురం పంచాయతీ స్పెషల్ ఆఫీసర్‌గాఎంపీడీవో విజయుదత్





**ఎటపాక, (రాజధాని వార్తలు):** ఎటపాక మండల పరిధిలోని లక్ష్మీపురం పంచాయతీ పాలన ప్రత్యేక అధికారి ఆధ్వర్యంలో కి వెళ్ళింది ప్రస్తుత సర్పంచ్ పదవీ కాలం ఏప్రిల్ 2తో ముగియడంతో తదుపరి ఎన్నికలు జరిగే వరకు ప్రభుత్వం నిబంధనల వేరకు వరిపాలన బాధ్యతలను రాష్ట్ర ప్రభుత్వం.అధికారులకు అప్పగిం చింది మండల ఎంపీడీవో విజయ్ దత్, లక్ష్మీపురం పంచాయతీ ప్రత్యేక అధికారిగా బాధ్యతలు స్వీకరించారు. బాధ్యత పత్రాలపై సంతకం చేసి అధికారంగా బాధ్యతలు చేపట్టారు నూతన స్పెషల్ అధికారికీ కణితి మధు మర్యాదపూర్వకంగా కలిసి సాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు కణితి మధు మాట్లాడుతూ మా పంచాయతీ ప్రజలకు అందుబాటులో ఉండాలని నీటి సమస్యలతో మరియు డ్రైనేజీ సమస్యలతో లక్ష్మీపురం పంచాయతీ ఇంకా అనేక సమస్యలతో ఉందని తమరు దృష్టికి తీసుకు రావడం జరుగుతుంది అని ప్రతి ఒక్క సమస్యని పరిష్కరించవలసినదిగా ప్రత్యేక పాలన అధికారికి కణితి మధు వివరించి విన్నవించడం జరిగింది. ఈ ప్రత్యేక పాలన అధికారి తెలియజేస్తూ లక్ష్మీపురం పంచాయతీలో ప్రతి సమస్యను పరిష్కరిస్తానని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బాదావత్ స్వామి సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ,

# రక్తదానం చేయండి - ప్రాణాలను కాపాడండి

## - ఫౌండేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సాయికుమార్, రేవంత్









**గజపతినగరం, (రాజధాని వార్తలు):** రక్తదానం చేయండి ప్రాణాలను కాపాడండి అని సహాయ స్ఫూర్తి ఫౌండేషన్ అధ్యక్ష కార్యదర్శులు సాయి కుమార్, రేవంత్ పిలుపునిచ్చారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం నాడు మండలంలోని వెంకటాపురం గ్రామంలో స్వచ్ఛంద రక్తదాన శిబిరం జరిగింది. ఈ సందర్భంగా సాయికుమార్ రేవంత్ మాట్లాడుతూ రక్తదానం చేయడం అనేది ప్రతి ఒక్కరి కనీస సామాజిక బాధ్యత అని సాయికుమార్, రేవంత్ అన్నారు.ఫౌండేషన్ సభ్యుడు ఇడిదల ఆషిక్ తల్లి పార్వతి జ్ఞాపకార్ధం ఈ శిబిరం నిర్వహించడం జరిగింది అని ఫౌండేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సాయికుమార్, రేవంత్ విలేకరులకు తెలియజేశారు. ఈ రక్తదాన శిబిరంలో 15 మంది రక్తదానం చేయడం జరిగిందని వారు తెలియజేశారు. విజయనగరంకి చెందిన యన్ వి యన్ బ్లడ్ బ్యాంక్ సిబ్బంది రక్తదాతల నుంచి రక్త పూతలను సేకరించారు. అనంతరం యన్వియన్ బ్లడ్ బ్యాంక్ యాజమాన్యం ఇడిదల పార్వతి జ్ఞాపికను కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ రక్తదాన శిబిరం కార్యక్రమంలో ఇడిదల అప్పారావు, ఇడిదల నరేంద్ర, లక్ష్మణ్, గంట్యాడ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ అభయ ఆంజనేయ స్వామి వారి ఆలయానికి శంకుస్థాపన



**ఎటపాక, (రాజధాని వార్తలు):** పోలవరం జిల్లా ఎటపాక మండలం గుండాల గ్రామంలో ప్రధాన రహదారి పక్కన నూతన అభయ ఆంజనేయ స్వామి వారి ఆలయానికి శనివారం శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.శ్రీ అభయ ఆంజనేయ స్వామి వారికీ పాలు, పండ్లు పుష్పలతో అభిషేకలు చేసి ప్రత్యేక అర్చనలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పలువురు టీడీపీ నాయకులు, బీజేపీ నాయకులు, పలువురు హాజరై స్వామి వారికి పసుపు కుంకుమ మరియు నవధాన్యాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుండాల గ్రామ ప్రజలు ఎప్పటి నుంచో తమ ఊరికి శ్రీ అభయ ఆంజనేయ స్వామి వారి ఆలయ నిర్మాణం జరగాలని కోరుకుంటున్నారాని, నేటికీ వారి కల సహకారం అయిందన్నారు. గుండాల గ్రామ ప్రజలకు శ్రీ రాముడు ఆంజనేయ స్వామి వారి ఆశీర్వాదం ఎల్లప్పుడూ ప్రజలందరికి ఉండాలని వారు కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# గ్రామ పరిపాలన సజావుగా సాగేందుకే ప్రత్యేక అధికారులను నియామకం



**పిఠాపురం, (రాజధాని వార్తలు):** గ్రామ సర్పంచుల పదవీకాలం ముగి యడంతో, గ్రామ పరిపాలన సజావుగా సాగేందుకు ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించింది. ఇందులో భాగంగా, అమరవల్లి గ్రామ ప్రత్యేక అధికారిగా డిప్యూటీ ఎంపీడీఓ గోవింద రాజు బాధ్యతలు చేపట్టారు. గౌరవనీయులు పిఠాపురం ఎమ్మెల్యే కొణిదెల పవన్ కళ్యాణ్ మరియు కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ మరియు యు.కొత్తపల్లి మండల జనసేన పార్టీ అధ్యక్షులు రావు అక్షయ్ ఆదేశాల మేరకు అమరవల్లి జనసేన పార్టీ పంచాయతీ ఇన్చార్జ్ శివారెడ్డి, గ్రామ జనసేన కమిటీ సభ్యులు ప్రత్యేక అధికారిని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

# శాస్త్ర సాంకేతిక రంగాలపై అవగాహనకు 'సైన్స్ ఎక్స్‌పోజర్ టూర్'

## - జిల్లా కలెక్టర్ డా.ఎన్.ప్రభాకర రెడ్డి

**పార్వతీపురం, (రాజధాని వార్తలు):** జిల్లాలోని విద్యార్థులకు శాస్త్ర సాంకేతిక రంగాలపై ఆసక్తిని, అవగాహనను పెంచే లక్ష్యంతో 'సైన్స్ ఎక్స్‌పోజర్ టూర్ – 2026' ఉండాలని జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర రెడ్డి పేర్కొన్నారు. శనివారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో విద్యా శాఖ ఆధ్వర్యంలో సైన్స్ ఎక్స్‌పోజర్ టూర్ – 2026 పోస్టర్‌ను జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, సీతంపేట ఐటీడిఏ ప్రాజెక్ట్ అధికారి పవార్ స్వప్నిల్ జగన్నాథ్, ఇతర అధికారులతో కలిసి కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల విద్యాశాఖ మరియు సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించబడుతోందని గుర్తుచేశారు. విద్యార్థులలో నూతన ఆవిష్కరణల పట్ల జిజ్ఞాసను పెంపొందించేందుకు ఇటువంటి విజ్ఞాన యాత్రలు ఎంతో దోహదపడతాయని తెలిపారు. ఈ అంతర్రాష్ట్ర విజ్ఞాన యాత్ర ఒడిశా రాజధాని భువనేశ్వర్‌లో ఏప్రిల్ 16, 17 తేదీల్లో రెండు రోజుల పాటు సాగుతుందన్నారు. విద్యార్థులకు ప్రయోగాత్మక అభ్యాస అనుభవాన్ని అందించడం, అధునాతన పరికరాలు మరియు సాంకేతికతపై అవగాహన కల్పించడం, శాస్త్రవేత్తలు మరియు నిపుణులతో ముఖాముఖి చర్చించే అవకాశం



కల్పించడం దీని ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. అలాగే సైన్స్ యొక్క వాస్తవ ప్రపంచ అనువర్తనాలను వివరించడంతో పాటు విద్యార్థులలో జట్టుకృషి మరియు సమష్టి తత్వాన్ని పెంపొందించడం ప్రధాన లక్ష్యమని వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు చురుగ్గా పాల్గొని శాస్త్ర సాంకేతిక రంగాలలో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకోవాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ పి.మురళీధర్, జిల్లా విద్యాశాఖాధికారి పి.బ్రహ్మాజీరావు, గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఎ.విజయశాంతి, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# దక్షిణ నియోజకవర్గంలో 200 మంది మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే వంశీకృష్ణ

## - నియోజకవర్గంలో ప్రతి కుటుంబానికి కూటమి ప్రభుత్వంలో ఏదొక రూపంలో లబ్ధి చేకూరే విధంగా కృషి చేస్తున్నానని తెలిపిన ఎమ్మెల్యే - మహిళలకు ఉపాధి అవకాశాలుకు, వారి అభివృద్ధికి లబ్ది చేకూరే నిరంతరం అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం







**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** దక్షిణ నియో జకవర్గంలో వివిధ వార్డులకు చెందిన 200 మంది మహిళలకు వైజాగ్ సి పోర్ట్ ప్రైవేట్ లిమిటెడ్ వారి కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా అందజేసిన కుట్టు మిషన్‌లను నియోజకవర్గ మహిళలకు స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ మహిళలు స్వయం ఉపాధి పొందినప్పుడు ఆ కుటుంబం మరింత అభివృద్ధికి అవకాశం ఉంటుందని తెలిపారు. మహిళలు అన్ని రంగాలలో ముందంజలో ఉన్నప్పుడు సమాజం అభివృద్ధి మరింత జరుగుతుందని తెలియ జేశారు. నియోజవర్గ పరిధిలో ప్రతి ఒక్కరికి ఏదో ఒక రూపంలో లబ్ధి చేకూరే విధంగా నిరంతర కృషి చేస్తున్నానని ఈ సందర్భంగా తెలిపారు. అదేవిధంగా కార్యక్రమానికి సహాయ సహకారాలు అందించినటువంటి వైజాగ్ సి పోర్టు ప్రతినిధులు రాంబాబు, గణేష్‌కి శాలువా వేసి, బొకే అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో కందుల నాగరాజు, ఆళ్ల శ్రీను, మన్యాల శ్రీనివాస్, ఆగంటి. శ్రావణ్ కుమార్, లెంక త్రినాధ్, తెలుగు అర్జున్ మరియు వీర మహిళలతో పాటు, కూటమి నేతలు పాల్గొన్నారు.

# ఒడిస్సా నుండి విశాఖకు గంజాయిని తరలిస్తున్న ముగ్గురు నిందితుల అరెస్ట్

**- విజయనగరం జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్, ఐపిఎస్ - ఒడిస్సాలో కొనుగోలు చేసి విశాఖపట్నం తరలిస్తుండగా ఎల్.కోట పోలీసులకు పట్టుబడిన ముగ్గురు నిందితులు - నిందితుల వద్ద నుండి రూ.10 లక్షల విలువ గల 55 కిలోల గంజాయి, ఒక కారు, ఒక స్కూటీ, మూడు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లుగా తెలిపిన జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్, ఐపిఎస్ - గంజాయి అక్రమ రవాణ లింకులను ఛేదించామని, త్వరలోనే మరో ఇద్దరు నిందితులను అరెస్టు చేస్తామన్న జిల్లా ఎస్పీ**







**విజయనగరం, (రాజధాని వార్తలు):** విజయనగరం జిల్లా ఎల్. కోట పోలీసులకి రాబడిన ఖచ్చితమైన సమాచారంతో ఒడిస్సా నుండి విశాఖపట్నం కారులో గంజాయిని తరలిస్తున్న ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుండి 25 ప్యాకెట్లలో గల 55 కిలోల గంజాయిని, ఒక కారు, మూడు సెల్ ఫోన్లు మరియు ఒక స్కూటీని స్వాధీనం చేసుకొని, నిందితులను రిమాండుకు తరలిస్తున్నట్లుగా జిల్లా పోలీసు కార్యాలయంలో ఏప్రిల్ 4న ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్, ఐపిఎస్ వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ మాట్లాడుతూ - ఎల్.కోట పోలీసులకు రాబడిన ఖచ్చితమైన సమాచారంతో ఏప్రిల్ 4న ఎల్.కోట మండలం, రంగరాయపురం జంక్షన్ వద్ద పోలీసులు వాహన తనిఖీలు చేపట్టి, ఒడిస్సా నుండి విశాఖపట్నంకు కారులో గంజాయిని తరలిస్తున్న (ఎ-1) అల్లూరి సీతారామరాజు జిల్లా, అరుకు మండలం, బోసుబెడ్డ గ్రామానికి చెందిన సోనై రాజబాబు (34సం.లు) అనే వ్యక్తిని, పోలీసులకు చిక్కకుండా కారుకు పైలట్ గా స్కూటీ పై వెళ్ళుతున్న (ఎ-2) ఒడిస్సా రాష్ట్రం, కోరాపుట్ జిల్లా, పాడువ మండలం, హట్టగూడ గ్రామానికి చెందిన సంజయ్ హంతల్ (46 సం.లు), (ఎ-3) ఒడిస్సా రాష్ట్రం, పూరి జిల్లా, తలజంగా, మధుబనబాలియ గ్రామానికి చెందిన సంజీబ్ కుమార్ మహంతి (40సం.లు)లను అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుండి 25 ప్యాకెట్లలోగల రూ.10 లక్షల విలువ గల 55 కిలోల గంజాయి, ఎపి 31 ఎఎస్ 7207 నంబరుగల కారు, ఎపి 39 బిడబ్ల్యు 2903 నంబరుగల స్కూటీ మరియు మూడు సెల్ ఫోన్లను సీజ్ చేసామని జిల్లా ఎస్పీ తెలిపారు. విచారణలో పట్టుబడిన ముగ్గురు నిందితులు గంజాయిని ఒడిస్సా రాష్ట్రంలో కొనుగోలు చేసి విశాఖపట్నం తరలిస్తున్నట్టుగా గుర్తించామన్నారు. వీరిలో (ఎ-1) రాజబాబుపై పెందుర్తి, గాజువాక, అరుకు పోలీసు స్టేషన్లలో గంజాయి కేసులు ఉన్నట్లుగా జిల్లా ఎస్పీ తెలిపారు. అరెస్టు కాబడిన నిందితులను రిమాండుకి తరలిస్తున్నామని, వీరిపై ఫైనాన్సియల్ ఇన్వెస్టిగేషను, పిట్ ఎన్.డి.పి.ఎస్. చట్టం ప్రకారం దర్యాప్తు చేస్తామని, పి.డి. చట్టంను కూడా ప్రయోగిస్తామని జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ కేసులో దర్యాప్తు ముమ్మరం చేసామని, గంజాయి అక్రమ రవాణకు కారకులైన, బాధ్యులైన ఒడిస్సాకు చెందిన పింకూ, దాదా అనే మరో ఇద్దరు నిందితులుగా గుర్తించామని, వారిని కూడా త్వరలో అరెస్టు చేస్తామని జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ తెలిపారు. జిల్లాను గంజాయి రహితంగా తీర్చిదిద్దేందుకు జిల్లా పోలీసుశాఖ, ఈగల్ టీమ్స్, ఈగల్ టాస్క్ ఫోర్సు కూడా పని చేస్తున్నాయన్నారు. గంజాయి నియంత్రణకు ప్రజలు కూడా తమవంతు సహకారాన్ని అందించాలని, గంజాయి రవాణ, వినియోగం, విక్రయం గురించి ఏదైనా సమాచారం తెలిస్తే వెంటనే 1972 లేదా డయల్ 112/100కు సమాచారం అందించాలన్నారు. జిల్లాను గంజాయి రహితంగా తీర్చిదిద్దేందుకు యువత మాదక ద్రవ్యాల బారిన పడకుండా పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. గంజాయి గురించిన సమాచారం ఇవ్వడంలో ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే, వారి కుటుంబాలను కూడా గంజాయి నాశనం చేసే పరిస్థితులు ఉన్నాయన్నారు. కావున, ప్రజలు తమకు తెలిసిన సమాచారాన్ని వెంటనే స్థానిక పోలీసులకు లేదా టోల్ ఫ్రీ నంబరు 1972కు అందించాలన్నారు. ఈ కేసులో నిందితులను అరెస్టు, గంజాయిని సీజ్ చేయుటలో క్రియాశీలకంగా పని చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని, ఈగల్ టాస్క్ ఫోర్సు సిబ్బందిని జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ ప్రత్యేకంగా అభినందించారు. పోలీసు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఎస్.కోట రూరల్ సర్కిల్ సిఐ ఎల్.అప్పల నాయుడు, ఎస్బీ సిఐ ఎ.వి.లీలారావు, ఎల్.కోట ఎస్ఐ సి.హెచ్.నవీన్ పడాల్ మరియు ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# టీటీడీ ఛైర్మన్‌గా బి.ఆర్.నాయుడును వెంటనే తొలగించాలి : మాజీ ఎమ్మెల్యే "బొత్స" డిమాండ్






**గజపతినగరం, (రాజధాని వార్తలు):** టీటీడీ ఛైర్మన్‌గా బి.ఆర్. నాయుడును కూటమి ప్రభుత్వం వెంటనే తొలగించాలని వైకాపా సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య డిమాండ్ చేశారు. పార్టీ అధినేత , మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పిలుపు మేరకు మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పల నరసయ్య ఆధ్వర్యంలో శనివారం నాడు గజపతినగరం నియోజక వర్గ వైకాపా నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో గజపతి నగరంలో ర్యాలీ నిర్వహించి, నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ముందుగా పట్టణంలోని నాలుగు రోడ్లు కూడలి నుంచి ప్రారంభమైన నిరసన ర్యాలీ సిమెంట్ రోడ్, బజారు వీధుల మీదుగా శ్రీ సీతారామ వెంకటేశ్వర స్వామి ఆలయం వరకు సాగింది. పార్టీ శ్రేణులు బి.ఆర్. నాయుడును తొలగించాలి..., తిరుమల పవిత్రతను కాపాడాలి......అనే నినాదాలు చేస్తూ నిరసన ర్యాలీ చేపట్టారు. ర్యాలీ అనంతరం మాజీ ఎమ్మెల్యే బొత్స ఆధ్వర్యంలో శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో బి.ఆర్ నాయుడును తొలగించే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు మంచి జ్ఞానోదయాన్ని కలిగించాలని ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా బొత్స అప్పల నరసయ్య విలేకరులతో మాట్లాడుతూ, తిరుమల పవిత్రతను అపవిత్రం చేస్తున్న చైర్మన్ బి.ఆర్ నాయుడును ప్రభుత్వము ఎందుకు టీటీడీ చైర్మన్ పదవి నుంచి తొలగించలేదని ప్రశ్నించారు. తిరుమల పవిత్రతను కాపాడటంలో బి.ఆర్ నాయుడు విఫలమయ్యాడని అందువల్లనే రాష్ట్రంలో అనేకమైన విషాదకర సంఘటనలు జరుగుతున్నాయని బొత్స ఆవేదన వ్యక్తం చేశారు. దేవాలయాల్లో తొక్కిసలాటలు, భక్తులు ప్రాణాలు కోల్పోవడంలాంటి విచారకరమైన సంఘటనలు జరుగుతున్నాయని మాజీ ఎమ్మెల్యే బొత్స అన్నారు. తిరుమలలో అసాంఘిక కార్యక్రమాలు జరుగుచున్న బి.ఆర్.నాయుడును టిటిడి చైర్మన్‌గా ప్రభుత్వం కొనసాగించడం వెనక ఆంతర్యం ఏమిటో అర్థం కావడం లేదని బొత్స ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు మండల సురేష్, కరణం ఆదినారాయణ,జడ్పీటిసిలు గార తౌడు, వర్రీ నరసింహమూర్తి, రౌతు రాజేశ్వరి, గజపతినగరం మండల పార్టీ అధ్యక్షులు బూడి వెంకటరావు, ఎంపీపీలు చల్లా చల్లమనాయుడు, గేదెల సింహాద్రి నాయుడు, మాజీ ఎంపీపీ కంది తిరుపతి నాయుడు, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు పీరుబండి జైహింద్ కుమార్, మాజీ ఏఎంసీ చైర్మన్ వేమలి ముత్యాల నాయుడు, వైస్ ఎంపీపీ కర్రీ శ్రీదేవి, కృష్ణార్జున, బొద్దల చిన్నమ నాయుడు, వైఎస్ఆర్సీపి నాయకులు బెల్లాన త్రినాధరావు, కే. పైడిపు నాయుడు, పల్లి సంజీవరావు, కర్రీ రామునాయుడు, కర్రీ నానాజీ, పలువురు నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ వైద్య సేవలు

**- రాష్ట్ర స్థాయిలో నంబర్ వన్ కావాలి - మన్యం జిల్లా ఆసుపత్రి అభివృద్ధిపై సమీక్షలో జిల్లా కలెక్టర్ డా.ఎన్.ప్రభాకర రెడ్డి**







**పార్వతీపురం, (రాజధాని వార్తలు):** మన్యం జిల్లా ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రిలోనే కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయని, ప్రజలు ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లి వేల రూపాయలు ఖర్చు చేయాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ డా.ఎన్. ప్రభాకర రెడ్డి తెలిపారు. జిల్లా ఆసుపత్రిలో జరిగిన జిల్లా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఆసుపత్రిలో జరిగిన మార్పులు మరియు నూతన సౌకర్యాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. గత కొద్ది కాలంగా ఆసుపత్రిలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని, ప్రస్తుతం ఆసుపత్రి ఆవరణ మొత్తం ఎంతో పరిశుభ్రంగా, ఆహ్లాదకరంగా మార్చబడిందని తెలిపారు. సీఎస్సార్ నిధుల ద్వారా కంటి ఆపరేషన్లకు సంబంధించిన అత్యాధునిక పరికరాలు, బ్లడ్ బ్యాంకుకు అవసరమైన కొత్త యంత్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అలాగే ఆసుపత్రి ప్రాంగణంలో కొత్తగా హెర్బల్ గార్డెన్‌ను అభివృద్ధి చేశారని, రోగుల సహాయకుల కోసం ప్రత్యేకంగా కూర్చునే వసతి, స్వచ్ఛమైన తాగునీరు మరియు రన్నింగ్ వాటర్ సౌకర్యంతో కూడిన శుభ్రమైన టాయిలెట్లను అందుబాటులోకి తెచ్చారని గుర్తు చేశారు. ఆసుపత్రిలో సామర్థ్యం కంటే ఎక్కువగా, దాదాపు 180% ఆక్యుపెన్సీతో ఆసుపత్రి నడుస్తున్నప్పటికీ, వైద్యులు మరియు సిబ్బంది ఎంతో సమర్థవంతంగా సేవలు అందిస్తున్నారని ప్రశంసించారు. వివిధ ఆరోగ్య సూచీలలో ఈ ఆసుపత్రి రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలవడం గమనార్హమని అన్నారు. రాష్ట్రంలోనే మొదటిసారిగా ఆసుపత్రి ఆవరణలో ఆరోగ్య కళా వేదికను ప్రారంభించుకుంటున్నట్లు చెప్పారు. ఈ వేదిక ద్వారా కళా రూపాలు, వీడియోలు మరియు చిత్రాల ద్వారా రోగులకు, వారి బంధువులకు ఆరోగ్యం పట్ల అవగాహన కల్పిస్తారని తెలిపారు. ఆసుపత్రి వాతావరణంలో ఒత్తిడికి గురయ్యే వారికి ఈ వేదిక మానసిక ఉల్లాసాన్ని మరియు ప్రశాంతతను అందిస్తుందన్నారు. ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తూ ఉచితంగా వైద్యం, మందులు అందిస్తున్నందున, మన్యం జిల్లా ప్రజలు ఈ సదుపాయాలను వినియోగించుకోవాలని కలెక్టర్ కోరారు. జిల్లాలో అందించిన వైద్య సేవల్లో రాష్ట్రస్థాయిలో జిల్లా నంబర్ వన్ కావాలని ఆకాంక్షించారు. అంతకుముందు జిల్లా ఆసుపత్రిలోని పలు విభాగాలను పరిశీలించిన ఆయన వైద్యులకు పలు సూచనలు, మార్గదర్శకాలు జారీచేసారు. అనంతరం ఆవరణలో ఔషధ మొక్కల పెంపకం, రక్త నిధి, రక్తనిధికి అవసరమైన పరికరాలను కలెక్టర్ ప్రారంభించారు. ఈ సమావేశంలో పాల్గొన్న జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, మెంబర్ మరియు కన్వీనర్ డా.వై.నాగ శివ జ్యోతి, డీసీహెచ్ఎస్ డా.జి.నాగభూషణరావు, సభ్యులు డా. ఎస్.భాస్కరరావు, డా.కె.పార్వతి, డా. ఎన్.భారతి, మునిసిపల్ కమిషనర్ డి.పావని, ఇతర వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రెవిన్యూ వసూళ్లలో లక్ష్యాలు చేరుకోవాలి

**- రెవెన్యూ వసూళ్ల లక్ష్యాల సాధనపై జిల్లా కలెక్టర్ సమీక్ష : జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి**





**విజయనగరం, (రాజధాని వార్తలు):** రెవిన్యూ వసూళ్లలో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి అధికారులను అదేశించారు. జిల్లాలో వివిధ శాఖల రెవెన్యూ వసూళ్ల పురోగతిపై జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి శనివారం కలెక్టర్ ఛాంబర్లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్బంగా రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖ, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ, వాణిజ్య పన్నుల శాఖ, గనులు మరియు భూగర్భ శాఖ, రోడ్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ, అటవీ శాఖలు శాఖల వారీగా నిర్దేశించిన లక్ష్యాలు, సాధించిన వసూళ్లు, పురోగతి శాతం, లోటుపాట్లపై సమగ్రంగా చర్చించారు. రెవిన్యూ వసూళ్లలో లక్ష్యం చేరుకోని శాఖలు వసూళ్లు పెంచేందుకు చర్యలు చేపట్టాలన్నారు. రెవెన్యూ లోటు ఉన్న శాఖలు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించి మిగిలిన నెలల్లో లక్ష్యాలను తప్పనిసరిగా సాధించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. వాణిజ్య పన్నుల శాఖకు సంబందించి జిల్లాలో కార్యకలాపాలు నిర్వహించే పరిశ్రమలు, సంస్థల కార్యాలయాలు జిల్లాలోనే రిజిస్ట్రేషన్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖకు సంబందించి అన్ రిజిస్టర్ కార్యకలాపాలు నిరోదించాలని, అనధికార లే అవుట్‌లకు నోటీసులు జారీ చేయాలన్నారు. కొత్తవలస, తెర్లం రిజిస్టర్ కార్యాలయంలలో రిజిస్ట్రేషన్‌లు తగ్గటంపై విచారణ చేయాలన్నారు. అన్ని శాఖలు రెవిన్యూ వసూళ్లలో రోజువారీ పర్యవేక్షణ చేపట్టాలని స్పష్టం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో సంబంధిత శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# పి.ఎస్ జంక్షన్లో ముమ్మరంగా వాహన తనిఖీలు : ఎస్.ఐ యు.మహేష్





**బొండపల్లి, (గజపతినగరం), (రాజధాని వార్తలు):** మండలంలోని బొండపల్లి పోలీస్ స్టేషన్ కూడలి వద్ద శనివారం నాడు ఎస్.ఐ యు.మహేష్ ఆధ్వర్యంలో సిబ్బంది ముమ్మరంగా వాహన తనిఖీలు చేపట్టారు. వాహన తనిఖీలలో భాగంగా మైనర్లు నడుపుతున్న వాహనాలను, అదేవిధంగా ఇన్సూరెన్సు లేని వాహనాలను సీజ్ చేయడం జరిగిందని ఎస్.ఐ యు.మహేష్ విలేకరులకు తెలియజేశారు. వాహనాలు నడుపుతున్న మైనర్ లైన పిల్లల తల్లిదండ్రులకి కౌన్సెలింగ్ ఇవ్వడం జరిగిందని ఎస్.ఐ యు.మహేష్ అన్నారు. అదేవిదంగా ఇన్సూరెన్స్ లేని వాహనాలకు ఇన్సూరెన్స్ చేసుకోవాలని, ఫేక్ ఇన్సూరెన్స్ చేసే వారిని నమ్మి మోసపోవద్దని ఎస్.ఐ యు.మహేష్ వాహనదారులకు కౌన్సిలింగ్ చేశారు.

ఫేక్ ఇన్సూ రెన్స్ ఉన్న వాహనాలను పట్టుకున్నట్లయితే అటువంటి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయడం జరుగుతుందని వాహన దారులకు ఎస్ఐ యు.మహేష్ అవగాహన కల్పించారు. వాహనదారుల అవగాహన కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# RAJADHANI CLASSIFIEDS Ad. Call
## 9440662699, rajadhanivartalu.com

### EDUCATIONAL

- కల్లం ఇంజనీరింగ్ కాలేజీ, గుంటూరు, 0863-2119726
- యస్ ఆర్ ఐ అకాడమీ అఫ్ సైన్సెస్ అండ్ హాస్పిటల్, మంగళగిరి 08645-230101
- ఎయిమ్స్ హాస్పిటల్, మంగళగిరి 9493065718
- యస్ ఆర్ యమ్ యూనివర్సిటీ, ఏపీ నీరుకొండ, 0863-2429299
- విట్ యూనివర్సిటీ, ఏపీ, ఐనవోలు, 0863-2370444
- IVY Overseas, Vijayawada 73375 55680
- VIVA School, Nambur 0866 668 8999
- , అరవింద స్కూల్ వేర్ ఈచ్ చైల్డ్ ఈజ్ స్పెషల్, మంగళగిరి 08645-246878
- Eurekha Child, An AID India Initiative, Chennai 89398 20480
- Adarsha Educational Society Visakhapatnam, 0891-287 4605
- SPRITS Colleges, Kadapa, 9848664650
- Centuriaon University Rollavaka, AP 9840015963

### HOSPITALS

- అష్రఫ్ మెటర్నిటీఇ అండ్ టి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, విజయవాడ డా.యంఎ. రెహమాన్, 0866-2475087
- చింతలూరు ఆయుర్వేదం డాక్టర్ డి.విశ్వనాథ్, 9032990138
- హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ మందడం, డా. రహీమ్ బాషా 87902 27564
- శాస్త్రి బామ్ ఆయుర్, మంగళగిరి, 7999959999
- Manipal Hospitals, Vijayawada, 0866-2469700
- Sri Sivanath Ayurvedic Clinic Vijayawada, 09440 162256
- Rushad Opticals,Mangalagiri 99667 87654

### MATRIMONIAL

- కావ్యశ్రీ మ్యారేజ్ లింక్స్: 1వ, 2వ,లేట్ మ్యారేజెస్, తోడు,సంబధాలు, డైవోర్సీస్, విడోస్, డోయర్స్,పెన్షనర్లకు,అన్ని కులాల వారికీ పోస్ట్ సెటిల్మెంట్లు(స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్) ఫోన్: 9100669324
- జానీ మ్యారేజ్ లింక్స్, విజయవాడ 985394613
- Post your Alliances ad on Rajadhani Vartalu NewsPaper
- Post your Alliances ad on rajadhanivartalu.com

### REAL ESTATE

- New Sneha Builders & Developers, Kurnool, AP 9440662699
- గాలిసా రియల్ ఎస్టేట్, అమరావతి 9440662699
- Apartments for Sale, Attractive Price,Crystal Constructions, Gated Community, NRI Hospital Road, Srinivasam Apartments, Mangalagiri, 9440662699
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం, 0866-2452129
- ప్రైమ్ లివింగ్ రియల్ ఎస్టేట్ మంగళగిరి, 994860855

### NGO's

- శ్రీ శారదా పీఠం, విశాఖపట్నం 0891-2763332
- జ్ఞానానందం, ఐనవోలు చర్చ్ 8790878542
- ఇమ్మానుయేల్ చర్చ్, ఐనవోలు 9866777439
- Christian Rights Protection Service of India, Vijayawada 79897 88645
- రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ టి.రమేష్, మంగళగిరి 0863-999999

### RESTAURENTS

- New Continental Park Hotel Vijayawada, 0866-6679999
- అయ్యూబ్ బిర్యానీ హౌస్, ఇబ్రహీంపట్నం 9502727306
- Hotel Ilapuram, Vijayawada 0866-2575251
- Lemontree Premier, Vijayawada, 0866-6919999
- Bismilla Biryani Point Tadepalli, 6300096288
- Khaleel Bhai Family, Restaurent, Guntur 855087555
- Novotel,Vijayawada 0866-6688999
- నాని స్వీట్స్, మంగళగిరి 8374220220, 9989229799
- Lakshmi Mourya Malkapuram, 9052631122
- Seweet Magic, Mangalagiri 9059323334
- Hello Idly, Mangalagiri 95424 93333
- Chill Out Restaurent Undavalli, 8179549922
- Hotel Park Residency Vijayawada-81216 69996

### COMPANIES

- ఈ-కామర్స్ కన్సల్టింగ్ నవీన్, 9008640610
- Insurence needs for NRI's Call 6305479394
- Hareesh Video Shooting 9666643567
- S RICE Traders Vijayawada 9849741984
- రవికాంత్, ఐటీ కన్సల్టింగ్ 9908188454
- ఎక్ట్రానిక్స్ స్మార్ట్ సొల్యూషన్స్, మంగళగిరి 0866-2466675
- ఐవిస్ ఇ-సర్వీలియన్సు కంపెనీ మంగళగిరి, 040-40038590
- నవీన్ ఈకామర్స్ కన్సల్టింగ్ 9008640610
- యూ యస్ ఎ స్మార్ట్ డీల్స్ గ్లోవ్స్ మాస్క్స్ 001-2489965595
- సిహెచ్.చంద్రశేఖర రెడ్డి, ది నూతక్కి ప్రాథమికవ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్, 08645-275239
- ఇన్కమ్ టాక్స్ ప్రాక్టీషనర్లు మంగళగిరి, 789998999
- Visakha Healthcare 92466 46561
- Vivanta, Vijayawada 0866 664 4444
- Minerva Grand 0866 667 8888
- Rain Tree Park, Nambur, ijmprop.com
- Echo Friendly Bags, Hyderabad-92461 69069
- ఏపీ యస్ యస్ డి సి హెల్ప్ లైన్ తాడేపల్లి, 8004252422
- Sri Venkateswara panbrokers, Guntur 0863-2228628
- మధు గ్రాఫిక్స్ డిజైనర్, హైదరాబాద్ 6303728907
- AICA Events, 9133133688
- శ్రీ దుర్గా డిజైనర్స్ లేడీస్ టైలర్స్ మంగళగిరి, 9959308664
- Madeena Trading Company Vijayawada, 9000628426
- పొట్లాబత్తుని శ్రీకాంత్ లక్ష్మి సారీస్, మంగళగిరి 08645-234002
- డిజిటల్ ఎక్స్పోనెంట్స్, కిషోర్ digitalexponents.in 7793903754
- చైతన్య జి.జి బ్యాంక్, రాయపూడి గుంటూరు జిల్లా, 08645-244266
- ఏపీ యస్ ఆర్ టి హెల్ప్ లైన్ తాడేపల్లి, 0863-2340678
- జవహర్ ఆటోనగర్ ఆటోమొబైల్ టెక్నికల్ అసోసియేషన్ 9394139239, 8143444459
- Capital Way Residency, Tadepalli, 9493523232
- Lemon Tree Hotel, Vijayawada, 866 691 9999
- For Classifieds ad, Call 9440662699
- Rajadhani Real Estate Plots,Amaravati, AP Buy / Sell 9440662699

RAJADHANIVARTALU.COM
9440662699


# అజేయమైన శక్తిగా అమరావతి



**అమరావతి, (రాజధాని వార్తలు):** అమరావతి అంటే ఒక నగరం కాదు.. ఒక శక్తి, ఒక పుణ్యభూమి, ఓ సాంప్రదాయం, పురోగతికి నిదర్శనం. అమరావతి రాజధాని ఆంధ్రప్రదేశ్ ప్రగతికి, వికసిత్ భారత్‌కు బలమైన పునాదిగా నిలవబోతున్నది. ప్రతి వ్యక్తి కలల అమరావతి రాజధానినిర్మాణం ఎట్టకేలకు సాకారమవుతోంది. రాష్ట్ర ప్రజల సుదీర్ఘ నిరీక్షణకు వారి సంకల్పానికి, ఆంకాక్షలకు నిదర్శనమే పార్లమెంట్ ఉభయ సభల్లో ఆమోదం పొందిన ఆంధ్రప్రదేశ్ పునర్వ్యస్థీకరణ బిల్లు. అమరావతి రైతులు చేసిన అమూల్యమైన త్యాగం, వారి పట్టుదల,నమ్మకమే రాజధాని కలను నేటి వరకు సజీవంగా ఉంచాయనడంలో సందేహమే లేదు. ఆంధ్రుల కలల రాజధానికి పట్టిన గ్రహణం ఎట్టకేలకు వీడింది.గత వైసీపి పాలనలో రాష్ట్రంలో అలుముకున్న అంధకారం పటాపంచలైపోయింది. అంతేకాదు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సుదీర్ఘ రాజకీయ అనుభవంతో ప్రపంచంలోనే అమరావతి ఒక అద్వితమైన భవిష్యత్తు నగరంగానిలిచే మంచిరోజులు పరాభవ సంవత్సరంలోనే రావడం శుభపరిణామం. కూటమి ప్రభుత్వ పాలనలో చంద్రబాబు నాయుడు సారధ్యంలో అమరావతి ఇక శాశ్వతమనే ధీమా ప్రతి ఒక్క తెలుగువాడిలో స్పష్టంగా కనిపిస్తున్నది. ఇది కేవలం ఒక్క నగరం కాదు. ఐదు కోట్ల మంది గుండె చప్పుడు. రైతుల త్యాగాలకు దక్కిన అసలైన విజయం ఇది. ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనికతలో రూపుదిద్దుకుంటున్న ఈ కలల రాజధాని ఇక అజేయమైన శక్తి. విభజన కష్టాల నుంచి గట్టెక్కి నవ్యాంధ్ర నిర్మాణంలో అమరావతి ఇక అజరామరంగా నిలిచిపోనుంది. కేంద్రం వేసిన ఈ రాజ ముద్రతో రాష్ట్ర భవిష్యత్తుకు భరోసా లభించింది. అభివృద్ధి పథంలో ఆంధ్రప్రదేశ్ కొత్త చరిత్రను లిఖించబోతోంది.

**నాడు సైబరాబాద్ ... నేడు అమరావతి**

తెలుగు జాతి ప్రయోజనాల కోసం సంపద సృష్టి కోసం ఆనాడు సైబరాబాద్‌ను నిర్మించిన చంద్రబాబు నాయుడు మనకంటూ ఓ రాజధాని ఉండాలనే సంకల్ప ఫలితమే అమరావతి. అమరావతి అనేది కేవలం రాజధాని కాదు. ఇది తెలుగుతల్లి ఆత్మ. ఉప్పు నిప్పులా ఢీ కొనే రాజకీయాలు, ఒకరిని ఒకరు చూడలేని పార్టీలే దేశంలో ఒక్క విషయంలో కూడా ఏకం కాని పక్షాలు ఒకేమాట మాట్లాడిన అంశం ఏదైనా ఉందంటే అది రాజధాని అమరావతే. ఇది చంద్రబాబు రాజకీయ చాణక్యానికి తార్కాణం. సిద్ధాంతాలు వేరు.. దారులు వేరు.. ఆశలు వేరు.. ఆశయాలు వేరు.. కాని దేశ ప్రయోజనాల ముందు అన్ని రాజకీయ పార్టీలు ఒకే దారిని ఎంచుకున్నాయి.కలిసి మద్దతునిచ్చాయి. కలిసి అభివృద్ధి కోసం సంకల్పించాయంటే చంద్రబాబు కృషి అమోఘం. నాటి శాతకర్ణి భారతాన్ని ఏకం చేసిన చక్రవర్తి. ఇదే భారత ప్రజాస్వామ్యంలో అన్ని రాజకీయపక్షాల మద్దతు కూడగట్టడంలో సఫలీకృతమైన నేటి చక్రవర్తి చంద్రబాబు. అమరావతిలో అదే స్వపాన్ని మళ్ళీ వెలిగించిన ఏకైక నాయకుడు ఆయన. దేశాన్ని ఏకం చేసిన నేల అమరావతే. అలాగే దేశానికి దిశ చూపించిన శాసనం అమరావతే. అది కేవలం రాజధాని బిల్లు అనుకుంటే పొరపాటే ఇది చరిత్రకు చట్ట సభల ప్రజా ప్రతినిధులు వేసిన రాజముద్ర. దీంతో వైసీపీ నాయకుల గుండెల్లో ప్రళయశంఖారావంగా మారింది. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర విభజనతో వచ్చిన గాయం అమరావతితోనే మానడం ఖాయం. వివాదాలతో ఆగిన అభివృద్ధి చంద్రబాబు నాయుడి తోనే పరుగెడుతుంది. ప్రపంచ కీర్తి కిరీటంగా అమరావతి నిలవాలని ఆకాంక్షిద్దాం.

**వాసంశెట్టి సుభాష్**
కార్మికశాఖమంత్రి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

# సీతం కళాశాలలో ఉచిత పాలిసెట్ కోచింగ్ తరగతుల ఘన ప్రారంభం




**విజయనగరం, (రాజధాని వార్తలు):** విజయనగరంలోని సీతం కళాశాలలో ఉచిత పాలిసెట్ కోచింగ్ తరగతులు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. 10వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులకు ఇది ఒక విలువైన అవకాశమని కళాశాల అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమాన్ని ప్రారంభిస్తూ డైరెక్టర్ డా.ఎం. శశిభూషణ్ రావు మాట్లాడుతూ, పాలిసెట్ పరీక్షలో విద్యార్థులు ఉన్నత ర్యాంకులు సాధించేందుకు అవసరమైన సమగ్ర శిక్షణ అందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఈ కోచింగ్ తరగతులు ప్రతిరోజూ ఉదయం 10:00 గంటల నుండి సాయంత్రం 4:00 గంటల వరకు సీతం క్యాంపస్‌లో నిర్వహించబడతాయని వివరించారు. ఈ శిక్షణలో అనుభవజ్ఞులైన గణితం, భౌతిక శాస్త్రం, రసాయన శాస్త్రాల అధ్యాపకులు ప్రత్యక్ష బోధన అందిస్తారు. విద్యార్థులకు అవసరమైన సమగ్ర స్టడీ మెటీరియల్‌ను ఉచితంగా అందించడంతో పాటు, వారి ప్రగతిని అంచనా వేయడానికి ప్రతిరోజూ ప్రాక్టీస్ టెస్టులు నిర్వహించబడతాయి. నిరంతర సాధన ద్వారా విద్యార్థుల విషయ పరిజ్ఞానం మరియు పరీక్షా సిద్ధతను మెరుగుపరచడంపై ప్రత్యేక దృష్టి సారించబడుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డా. డి.వి. రామమూర్తి, డీన్ డా. వై. నరేంద్ర కుమార్, అకడమిక్ కోఆర్డినేటర్ డా. సాయిరామ్ పట్నాయక్ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నాణ్యమైన విద్య అందించడంలో సంస్థ నిబద్ధతను వారు పునరుద్ఘాటించారు. బయటి ప్రాంతాల నుండి వచ్చే విద్యార్థుల కోసం బాలురు మరియు బాలికలకు వేర్వేరు హాస్టల్ సౌకర్యాలు కల్పించినట్లు కళాశాల యాజమాన్యం తెలిపింది. ఈ కార్యక్రమంలో ప్రవేశ బృంద సభ్యులు శ్రీ ఎన్. సతీష్ కుమార్, శ్రీ వై. ప్రవీణ్‌తో పాటు అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు. గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల విద్యార్థులు పాలిసెట్ పరీక్షలో మెరుగైన ఫలితాలు సాధించేందుకు అవసరమైన ప్రోత్సాహం మరియు మార్గదర్శకత్వం అందించడమే ఈ ఉచిత కోచింగ్ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. ఉచిత కోచింగ్‌లో చేరదలచిన విద్యార్థులు తమ పేర్లను నమోదు చేసుకోవడానికి క్రింది ఫోన్ నంబర్లను సంప్రదించాలని ప్రిన్సిపాల్ డా.డి.వి.రామమూర్తి సూచించారు. సంప్రదించవలసిన నంబర్లు: 9533545689, 7989040214, 9121267999.

# దివిలి ప్రత్యేక అధికారిగా ఎంపీడీవో



**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** పెద్దాపురం మండలం దివిలి గ్రామ సచివాలయం ప్రత్యేక అధికారిగా పెద్దాపురం మండల పరిషత్ అధికారి కెవివి సూర్యనారాయణ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జనసేన నీటి సంఘం ఉపాధ్యక్షులు జట్ల విజయ్ బాబు, తెదేపా నాయకులు కోటి, పంచాయితీ సిబ్బంది ప్రత్యేక అధికారి సూర్యనారాయణకు స్వాగతం పలికారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan